గురువారం 12 నవంబరు 2026

https://www.telugudesam.org



విశాఖ వేదికగా రూ.11 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం!

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పెట్టుబడుల పరుగులు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా

- వివరాలు 10లో..



సాగర తీరాన సీఐఐ సదస్సు

- రెండు రోజుల వేడుకకు సర్వాంగసుందరంగా ముస్తాబైన విశాఖపట్నం
- ఏపీ సంస్కృతి, అమరావతి వైభవం చాటేలా ప్రత్యేక అలంకరణలు
- పారిశ్రామిక దిగ్గజాలు, సీఈవోలతో సీఎం భేటీకి ప్రత్యేక హాల్స్ సిద్ధం

4

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 31వ 'సీఐఐ భాగస్వామ్య సదస్సు'కు సాగర తీర నగరం విశాఖపట్నం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో గురు, శుక్రవారాల్లో జరిగే సదస్సు జరగనుంది. దేశ, విదేశాల నుంచి తరలివచ్చే పారిశ్రామిక దిగ్గజాలు, ప్రతినిధులకు మన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సాదర స్వాగతం పలికేందుకు ప్రభుత్వం అద్భుతమైన ఏర్పాట్లు చేసింది. గిరిజన థింసా, గరగ, తప్పెటగుళ్లు, కూచిపూడి, తోలుబొమ్మలాటల ప్రదర్శనలతో పాటు ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలతో ప్రాంగణాన్ని మనోహరంగా తీర్చిదిద్దారు. అమరావతి వైభవం, విశాఖ తీరం, కడియం నర్సరీల ప్రత్యేకతలను ప్రదర్శిస్తున్నారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, అరకు కాఫీ, టూరిజం, లాజిస్టిక్స్, సోలార్ రంగాల్లో పెట్టుబడి అవకాశాలను వివరించేలా నమూనాలను అందుబాటులోకి తెచ్చారు. దిగ్గజ కంపెనీల చైర్మన్లు, సీఈవోలు... సీఎం నారా చంద్రబాబునాయుడితో నేరుగా సమావేశమై చర్చలు జరిపేందుకు ప్రత్యేక హాలు సిద్ధం చేశారు.

పారిశ్రామిక దిగ్గజాలతో సీఎం భేటీ

సీఐఐ సదస్సు వేళ విశాఖలో చంద్రబాబు వరుస సమావేశాలు

ఏపీలో పెట్టుబడులకు అంతర్జాతీయ ప్రతినిధులకు ఆహ్వానం



విశాఖపట్నంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనున్న నేపథ్యంలో విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నోవోటెల్ హోటల్లో వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు సహకరిస్తున్నామని తెలిపారు. స్టార్టప్ కంపెనీలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ (డబ్ల్యుఐపీవో) డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌ను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో సీఎం భేటీ అయ్యారు. యూఏఈ ఏర్పాటు చేయనున్న ఫుడ్ క్లస్టర్‌లో ఆ దేశానికి చెందిన అగ్రిఫుడ్ కంపెనీ సిలాల్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. జపాన్ రాయబారి కెయిచీ ఓనోతో జరిగిన సమావేశంలో పారిశ్రామిక పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, కీలక ఖనిజాలు, ఉక్కు పరిశ్రమ, గ్రీన్ ఎనర్జీ తదితర అంశాలపై చర్చించారు.

2



'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'తో మెరుగైన ఫలితాలు

12

- ఏపీ మున్సిపల్ మంత్రి నారాయణ
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి ఆరు జాతీయ అవార్డులు, ఢిల్లీలో స్వీకరించిన మంత్రి

రూ.632 కోట్లతో ఎత్తిపోతల పథకాల మరమ్మతులు



6

- ఖరీఫ్‌కు అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వినియోగంలోకి రావాలి
- జలహారతి కార్పొరేషన్ ద్వారా ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ
- ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు 2.5 ఏళ్లలో పూర్తవ్వాలి
- 4,171 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు.. 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం
- ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ తరహాలో వాటర్ రెగ్యులేటరీ కమిషన్
- సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

నాయుడుపేటలో రూ.4వేల కోట్లతో ఇండో-కొరియన్ బ్యాటరీ విడి భాగాల తయారీ పరిశ్రమ

- కార్బన్ రిసోర్సెస్, దక్షిణ కొరియాకు చెందిన కాస్మో ఏఎం అండ్‌టీ సంయుక్త భాగస్వామ్యంతో పరిశ్రమ
- బ్యాటరీ పరీక్షలు, రీసైక్లింగ్ పరిశోధనలకు ఐఐటీ తిరుపతితో కలిసి పనిచేయాలని మంత్రి నారా లోకేష్ సూచన

9

తిరుపతి జిల్లా నాయుడుపేటలో కార్బన్ రిసోర్సెస్, దక్షిణ కొరియాకు చెందిన కాస్మో ఏఎంఅండ్‌టీ సంయుక్త భాగస్వామ్యంతో పరిశ్రమ రూ.4వేల కోట్ల పెట్టుబడితో క్యాథోడ్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. భారత్-కొరియా భాగస్వామ్యంతో రానున్న ఈ పరిశ్రమ ద్వారా 700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ప్రపంచస్థాయి క్యాథోడ్ సాంకేతికతతో దేశీయ బ్యాటరీ సరఫరా వ్యవస్థకు బలం చేకూరనుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ తయారీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ పెట్టుబడి దోహదపడనుంది. బ్యాటరీ పరీక్షలు, రీసైక్లింగ్ పరిశోధనలకు ఐఐటీ తిరుపతితో కలిసి పని చేయాలని మంత్రి నారా లోకేష్ సూచించారు.



31st CII PARTNERSHIP SUMMIT 2026 ® VISAKHAPATNAM Growth • Partnership • Prosperity
చైతన్యరథం



ఇంటిగ్రేటెడ్ మోడల్ టౌన్‌షిప్‌పై దృష్టి సారించాలి

❑ **ఆంధ్రప్రదేశ్-సింగపూర్ భాగస్వామ్యంపై మూడవ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**





అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్–సింగపూర్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అమలులో భాగంగా నిర్వహించిన మూడో జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశం బుధవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, సింగపూర్ ప్రభుత్వ మంత్రి గన్ సియో హువాంగ్ నేతృత్వంలోని 14 మంది సభ్యుల ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్ మంత్రి రాష్ట్రంలో భాగస్వామ్య కార్యక్రమాల పురోగతిని, ముఖ్యమంత్రి ముందుచూపును ప్రశంసించారు. మరోవైపు 2027 మార్చి నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సింగపూర్ బృందానికి ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, అంతరిక్షం, డ్రోన్ల రంగాల్లో కొత్త హబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల సంభవించిన తుఫాను సమయంలో నాలుగు రోజుల్లోనే 30వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించినట్లు వివరించారు.

సామర్థ్య పెంపు, నైపుణ్యాభివృద్ధిపై చర్చ

సింగపూర్‌లో మంత్రుల బృందం నిర్వహించిన కార్యక్రమం ఫలవంతంగా సాగిందని సింగపూర్ ప్రతినిధులు తెలిపారు. సివిల్ సర్వీసెస్ సంస్కరణలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారని, ఏడుగురు కలెక్టర్లు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నారని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అమలుకు ఇరు పక్షాలు సమన్వయంతో, పూర్తిస్థాయిలో సమయాన్ని కేటాయించి పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. స్పష్టమైన మైలురాళ్లను నిర్దేశించుకుని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి పురోగతిపై సమీక్షించాలని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా 2027 మార్చి వరకు ఒక ప్రణాళిక, 2028 మార్చి వరకు మరో ప్రణాళికను ప్రాధాన్యతాక్రమంలో సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్–సింగపూర్ భాగస్వామ్యం ద్వారా ప్రపంచస్థాయి ఉత్తమ విధానాలు రాష్ట్ర ప్రజలకు చేరువవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

పారిశ్రామిక రాయితీలు, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

ఏపీలో పెట్టుబడులకు సానుకూల వాతావరణం: సీఎం చంద్రబాబు - జపాన్ రాయబారి కెయిచీ ఓనోతో సీఎం చర్చ





విశాఖపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పారదర్శకమైన రాయితీల విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పరిశ్రమలకు అందించే రాయితీల కోసం ఎస్క్రో అకౌంట్ విధానాన్ని తీసుకొచ్చామని, రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని వెల్లడించారు. విశాఖపట్నంలో జపాన్ రాయబారి కెయిచీ ఓనోతో జరిగిన సమావేశంలో పారిశ్రామిక పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, కీలక ఖనిజాలు, ఉక్కు పరిశ్రమ, గ్రీన్ ఎనర్జీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారికి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ దిశగా జపాన్ సంస్థలు సహకరించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జపాన్ ప్రతినిధులు రాష్ట్రంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

రేర్ ఎర్త్ మినరల్స్ సరఫరాలో భాగస్వామ్యం

జపాన్‌కు రేర్ ఎర్త్ మినరల్స్ సరఫరాను స్థిరంగా కొనసాగించే అంశాన్ని జపాన్ ప్రతినిధులు ప్రస్తావించారు. కీలక ఖనిజాల సరఫరాలో భారత్–జపాన్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ సహకారం దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే ఆర్సెలార్ మిట్టల్–నిప్పన్ స్టీల్ ఇండియా ఉక్కు ప్లాంటుకు సంబంధించి తుది దశ ప్రాసెసింగ్‌కు అవసరమైన సెమీ ఫినిష్డ్ ఉత్పత్తులను జపాన్‌లోని మాతృ సంస్థ నుంచి నిరాటంకంగా దిగుమతి చేసుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ల తయారీలో ఉపయోగించే అమార్ఫస్ మెటల్‌ను దేశంలో తొలిసారిగా తయారు చేయాలని ప్రొటీరియల్ ఇండియా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక రాయితీలతో 2026 డిసెంబరులో శ్రీసిటీలో ఉత్పత్తి ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.

విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

భారతీయ నిపుణుల ప్రతిభను వినియోగించుకుంటూ, భారత్–జపాన్ సహకారంతో ఈ ఏడాది విశాఖపట్నంలో కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ప్రారంభించినట్లు జపాన్ ప్రతినిధులు తెలిపారు. భారతీయ నిపుణుల సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో వినియోగించుకునేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు. మరోవైపు కాకినాడ నుంచి ఐదేళ్ల పాటు ఏటా సుమారు 70 వేల టన్నుల గ్రీన్ అమ్మోనియా కొనుగోలు చేసేందుకు జపాన్‌కు చెందిన జెరా సంస్థ, ఏఎం గ్రీన్‌తో ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రతినిధులు వెల్లడించారు. భారత్–జపాన్ మధ్య గ్రీన్ అమ్మోనియా సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు ఇది కీలక ముందడుగని పేర్కొన్నారు.

31st CII PARTNERSHIP SUMMIT 2026 | VISAKHAPATNAM Growth • Partnership • Prosperity | చైతన్యరథం



పెట్టుబడుల ఆకర్షణలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'

- **పారిశ్రామిక ప్రముఖులతో సీఎం చంద్రబాబు భేటీ**
- **పాల్గొన్న మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్**
- **హీరో, అపోలో, భారత్ బయోటెక్, జీఎంఆర్ వంటి ప్రతినిధుల ప్రశంసలు**

విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను రప్పించడమే లక్ష్యంగా విశాఖపట్నంలో గురువారం ప్రారంభం కానున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దౌత్యం వేగవంతమైంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన వివిధ బహుళ జాతీయ కంపెనీల సీఈవోలు, సీఎండీలతో సీఎంతో పాటు రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీలు... హీరో గ్రూప్, భారత్ బయోటెక్, అపోలో హాస్పిటల్స్, సన్ ఇంటర్నేషనల్, రెన్యూ, రాక్‌వెల్ ఆటోమేషన్, జీఎంఆర్ గ్రూప్‌లకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులు, సీఈవోలు పాల్గొన్నారు.రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస' విధానం అత్యంత అభినందనీయమని కంపెనీల సీఈవోలు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. ఏపీలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్న తీరుపై పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్రంలో భాగస్వామ్యానికి సంసిద్ధత కనబరిచారు.





శభాష్ శ్రావణి

విశాఖ మేయర్‌గా ఘన విజయం సాధించిన శ్రావణికి మంత్రి లోకేష్ అభినందన



విశాఖపట్నం (చైతన్యరథం): ఇటీవల జరిగిన విశాఖపట్నం కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి తరపున టీడీపీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేసి అఖండ విజయం సాధించిన ముక్కా శ్రావణిని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు విశాఖ చేరుకున్న మంత్రి లోకేష్‌ను బుధవారం సాయంత్రం శ్రావణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన శ్రావణిని ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ టీడీపీ కంచుకోట అని మరోసారి నిరూపించారన్నారు. త్వరలో జరగబోయే 23 మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేసేలా ఇటీవల గెలిచిన అభ్యర్థులకు బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు.

సీఎం చంద్రబాబుతో 'రెన్యూ' గ్రూప్ సీఈవో సుమంత్ సిన్హా భేటీ

- రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల విస్తరణపై సుదీర్ఘ చర్చ

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ప్రముఖ విద్యుత్ ఉత్పత్తి సంస్థ 'రెన్యూ' చైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా తన ప్రతినిధుల బృందంతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో రెన్యూ సంస్థ చేపడుతున్న విండ్, సోలార్, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల విస్తరణపై ముఖ్యమంత్రితో సుమంత్ సిన్హా విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగానికి ఉన్న విస్తృత అవకాశాలు, నూతన పెట్టుబడులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై సీఎం స్పందిస్తూ... పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తామని వారికి స్పష్టం చేశారు.








31st CII PARTNERSHIP SUMMIT 2026 | VISAKHAPATNAM Growth • Partnership • Prosperity
చైతన్యరథం





సాగర తీరంలో పెట్టుబడుల పండుగ!

- **నేటి నుంచి విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు**
- **ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**
- **రెండు రోజులపాటు ఆరు అంశాలపై కీలక చర్చలు**
- **పాల్గొననున్న దేశ,విదేశీ ప్రతినిధులు**
- **రూ.11 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం**

విశాఖపట్నం (చైతన్యరథం): పెట్టుబడుల పండుగకు సాగర నగరం సిద్ధమయింది. విశాఖ వేదికగా గురువారం నుండి ప్రారంభమయ్యే 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయే. గురు, శుక్రవారాల్లో జరిగే ఈ సదస్సుకు సీఎం చంద్రబాబునాయుడు, పలువురు కేంద్రమంత్రులు, దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. ఈ సదస్సు ద్వారా రూ.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ సదస్సు కోసం ఏపీ సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక ప్రత్యేకతలను చాటిచెప్పేలా నగరాన్ని తీర్చిదిద్దడంతో పాటు, పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్యాల చర్చలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను 'నేవిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్ ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' థీమ్‌తో 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు కీలక కేంద్రంగా ఏపీని నిలపడమే లక్ష్యంగా సీఐఐ సదస్సు జరుగుతోంది. 58 దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక రంగాలకు చెందిన ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారు. 16 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు పాల్గొననున్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తదితరులు హాజరుకానున్నారు. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా 13 తేదీన ముగింపు కార్యక్రమం జరగనుంది.



కీలక అంశాలపై చర్చలు

రెండు రోజుల సమ్మిట్‌లో ఆరు కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం – పెట్టుబడులు – గ్లోబల్ వాల్యూ చైన్స్, ట్రస్ట్–జియో ఎకనమిక్స్–గ్లోబల్ కో ఆపరేషన్, వ్యవసాయం–ఆహార భద్రత–జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, ప్రతిభ–నైపుణ్యాలు–అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు, సాంకేతికత–ఆవిష్కరణలు–భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం–సుస్థిర వృద్ధి.. అంశాలపై విస్తృత చర్చలు జరగనున్నాయి. ప్రపంచ ఆర్థిక మార్పులకు అనుగుణంగా ఏపీ పారిశ్రామిక రంగానికి నూతన దిశానిర్దేశం వంటి అంశాలపై చర్చ జరుగుతుంది.

మహిళా సాధికారత కోసం..

సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సమాంతరంగా ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్–2026 నిర్వహించనున్నారు. ఇందులో మహిళా సాధికారత, పారిశ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యం, ఆర్థిక వృద్ధిపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు, వ్యాపార అవకాశాలు, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానంపై దృష్టి సారిస్తారు.

ప్రధాన సదస్సుకు ముందుగా ప్రాంతీయ సన్నాహక పెట్టుబడుల సదస్సులను నిర్వహించారు. 5 ప్రాంతాల్లో నిర్వహించిన సన్నాహక సదస్సులతో రూ.86,522 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. 12, 13వ తేదీల్లో జరిగే ప్రధాన సదస్సులో సుమారు 400కు పైగా బిజినెస్ సమావేశాలు జరగనున్నాయి. ప్రభుత్వాలు, పారిశ్రామిక సంస్థల మధ్య బిజినెస్ టు గవర్నమెంట్ సమావేశాలతో పాటు అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులతో విస్తృత చర్చలు జరుగుతాయి. ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమలను అనుసంధానించేందుకు కీలక ఒప్పందాలు కుదరనున్నాయి. ఈ సదస్సు కోసం ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖకు చేరుకుని పలువురు విదేశీ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ఏపీ సంస్కృతి ఉట్టిపడేలా..

విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ లో 12,13 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఏపీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విదేశీ అతిథులకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గిరిజన థింసా డాన్స్, గరగ నృత్యం, తప్పెట గుళ్ళు తదితర సంప్రదాయాలను తెలియచేసేలా ఏర్పాట్లు చేశారు. ఏటి కొప్పాక, కొండపల్లి బొమ్మలు, తోలుబొమ్మలాట కూచిపూడి లాంటి సాంప్రదాయ కళల్ని ప్రదర్శించేలా అలంకరణ చేశారు. ఏపీ తీర ప్రాంతం, ఆతిథ్యం, రుచులు, అమరావతి వైభవం, నూతన రాజధాని, కడియం నర్సరీ లాంటి ప్రత్యేకతలను ప్రదర్శించేలా కళాకృతులు ప్రదర్శించనున్నారు. రాష్ట్రంలో వనరులు, పెట్టుబడి అవకాశాలను పారిశ్రామిక వేత్తలకు తెలియ చెప్పేలా వ్యవసాయం, ఉద్యాన పంటలు, అరకు కాఫీ, టూరిజం, లాజిస్టిక్స్, సోలార్ తదితర అంశాలను చాటి చెప్పేలా స్టాళ్లు, కళాకృతులు ఏర్పాటు చేశారు.

వేరువేరు ప్రాంగణాలు సిద్ధం

ప్రధాన ప్లీనరీ హాల్ తో పాటు పారిశ్రామిక వేత్తలు చర్చలు జరిపేలా వేరు వేరు ప్రాంగణాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. దిగ్గజ కంపెనీల చైర్మన్లు, సీఈఓలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అయి చర్చలు జరిపేందుకు వీలుగా మరో ప్రత్యేక హాల్ సిద్ధం చేశారు. బిజినెస్ టూ బిజినెస్, గవర్నమెంట్ టు బిజినెస్ చర్చల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భాగస్వామ్యాలు, ఒప్పందాలు కుదుర్చుకునేందుకు, ఒకేసారి రెండు, మూడు కార్యక్రమాలు నిర్వహించుకునేలా సమావేశ మందిరాలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశ మందిరాల్లో ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు ఆరు కీలకమైన అంశాలపై మేధో మథనం జరగనుంది.





రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా

స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నాం

ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చేలా వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ సహకరించాలి - స్టార్టప్‌లకు మేధో సంపత్తి హక్కులపై WIPO ప్రతినిధులతో సీఎం చంద్రబాబు చర్చలు





విశాఖపట్నం (చైతన్యరథం): ఆవిష్కరణలు, పరిశోధన, సృజనాత్మకతకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, రాష్ట్రంలోని స్టార్టప్‌లు–పారిశ్రామికవేత్తలకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్–WIPO డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో సమావేశమయ్యారు. గురువారం నుంచి రెండు రోజుల పాటు సీఐఐ భాగస్వామ్య సదస్సులో జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ చేరుకున్నారు. నోవోటెల్ హోటల్లో వరుస సమావేశాలు నిర్వహించారు. దీంట్లో భాగంగా సీఎం చంద్రబాబు WIPO డీజీతో భేటీ అయ్యారు. WIPO–ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఏర్పాటు, భాగస్వామ్య కార్యక్రమం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, సూక్ష్మ–చిన్న–మధ్యతరహా పరిశ్రమలకు మేధో సంపత్తి హక్కులు, పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, డిజైన్లు, సాంకేతిక పరిజ్ఞాన పరిరక్షణపై శిక్షణ అందించే అవకాశాలను చర్చించారు. రాష్ట్రంలోని చేనేత, హస్తకళలు, స్థానిక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (GI Tag) సాధించడం, ఇప్పటికే గుర్తింపు పొందిన ఉత్పత్తుల మార్కెట్ విస్తరణ, వాటి నాణ్యత–బ్రాండింగ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే అంశాలపై WIPO సహకారాన్ని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు సహకరిస్తున్నామని తెలిపారు. స్టార్టప్ కంపెనీలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చేలా... రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని WIPO ప్రతినిధులను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.

స్టార్టప్ ఎకో సిస్టమ్ బలోపేతమే లక్ష్యం

WIPO డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో భేటీ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పాలసీల గురించి చర్చించారు. ముఖ్యంగా స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న విధానాలను వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం సదస్సులు అద్భుతంగా నిర్వహిస్తున్నారని డారెన్ టాంగ్ చంద్రబాబుతో అన్నారు. అనేక రంగాల్లో ప్రముఖులను, ప్రముఖ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడం మంచి పరిణామమని... దీనివల్ల వివిధ రంగాలకు సంబంధించిన అంశాలపై అందరికీ అవగాహన కలుగుతుందని అభిప్రాయపడ్డారు. తాము ఇప్పటికే ఏపీలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి విన్నామని... క్వాంటం టెక్నాలజీని ప్రోత్సహించడంలో ఏపీ ముందు వరుసలో ఉందని... అమరావతి క్వాంటం గురించి కూడా తమకు అవగాహన ఉందని డారెన్ టాంగ్ ముఖ్యమంత్రి దగ్గర ప్రస్తావించారు. ఏపీని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టినట్టు సీఎం చంద్రబాబు డారెన్ టాంగ్‌కు వివరించారు. క్వాంటం, ఏఐ వంటి టెక్నాలజీలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతను సిద్ధం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రైవేటు రంగంతో పాటు.. పాలనలో కూడా టెక్నాలజీని వినియోగించడం ద్వారా ప్రగతి సాధించడంతోపాటు... ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభతరంగా అందించేలా చేస్తున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ, స్పేస్ టెక్నాలజీ, క్వాంటం, నాచురల్ ఫార్మింగ్ సహా అనేక రంగాల్లో ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని సీఎం తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని... 10 లక్షల మంది మహిళలను వ్యాపారవేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. స్థానికంగా మహిళలు తీర్చిదిద్దే ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' పేరుతో బ్రాండింగ్ చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. మహిళా సాధికారత కోసం తాము అమలు చేసే విధానాల్లో WIPO భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో WIPO ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఏపీలో అపారమైన అవకాశాలు

- **మారిటైమ్ రంగంలోనూ యూఏఈతో కలిసి పనిచేసేందుకు సిద్ధం**
- **యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో సీఎం చంద్రబాబు భేటీ**





విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని దుబాయ్–యూఏఈలకు చెందిన వివిధ ప్రముఖ కంపెనీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు. సీఐఐ సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సీఎంతో భేటీ అయ్యారు. రాయలసీమకు చెందిన ఫలాలు ఇప్పటికే విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని సీఎం చంద్రబాబు తౌక్ అల్ మర్రీ దృష్టికి తెచ్చారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. యూఏఈ ఏర్పాటు చేయనున్న ఫుడ్ క్లస్టర్‌లో ఆ దేశానికి చెందిన అగ్రిఫుడ్ కంపెనీ సిలాల్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్రంలో వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, ఎగుమతుల రంగాల్లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. చిత్తూరు జిల్లాలో దుబాయికి చెందిన ఫ్లోర్‌మాస్టర్ పరిశ్రమ గ్రౌండింగ్ విషయం కూడా ఇద్దరి మధ్య ప్రస్తావనకు వచ్చింది. ఫుడ్ క్లస్టర్ లో త్వరితగతిన నిర్ణయం తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు యూఏఈ మంత్రి తౌక్ మర్రిని కోరారు. అలాగే మారిటైమ్, ఏరో స్పేస్, డిఫెన్స్ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూఏఈతో కలిసి పనిచేసేందుకు ఏపీ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.

భోగాపురం విమానాశ్రయం అద్భుతంగా ఉంది: యూఏఈ మంత్రి

ఏపీలో నూతనంగా నిర్మించిన భోగాపురం విమానాశ్రయం అద్భుతంగా ఉందని యుఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ అల్ తౌక్ మర్రి ముఖ్యమంత్రితో అన్నారు. సుందరమైన విమానాశ్రయాన్ని ఏపీలో నిర్మించిన సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. భారత తూర్పు తీరంలో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ఆసక్తిగా ఉందని.. తమ దేశ పెట్టుబడులకు ఏపీ కీలక ప్రాంతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీకి బ్లూచిప్ కంపెనీలు, గూగుల్ లాంటి డేటా సెంటర్లు రావటం శుభపరిణామం అని అన్నారు. పెట్టుబడులను రాబట్టే విషయంలో ఏపీకి ఉన్న సామర్థ్యం ఏమిటో తెలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రొయ్యలతో పాటు ఇతర ఆక్వా ఉత్పత్తుల దిగుమతులపై ఆలోచన చేస్తున్నట్టు యూఏఈ ప్రతినిధి బృందం తెలిపింది. ఏపీలో పెట్టనున్న ఫుడ్ క్లస్టర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన మరో 12 కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని సీఎంకు వివరించారు. ఈ భేటీలో యూఏఈకి చెందిన అధికారులు, కంపెనీల ప్రతినిధులు, ఏపీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

31st CII PARTNERSHIP SUMMIT 2026 | VISAKHAPATNAM Growth • Partnership • Prosperity | చైతన్యరథం

రూ.632 కోట్లతో ఎత్తిపోతల పథకాల మరమ్మతులు



- ఖరీఫ్‌కు అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వినియోగంలోకి రావాలి
- జలహారతి కార్పొరేషన్ ద్వారా ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ
- ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు 2.5 ఏళ్లలో పూర్తవ్వాలి
- 4,171 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు.. 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం
- ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ తరహాలో వాటర్ రెగ్యులేటరి కమిషన్
- సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

అమరావతి (చైతన్యరథం): గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్రంలో నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి జూన్ నాటికి వాటి ద్వారా నీరు విడుదల చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఖరీఫ్‌కు పునరుద్ధరణ పరిధిలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల మరమ్మతులను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాటి స్థితిగతులను పరిశీలించి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, నిర్వహణ, ఇరిగేషన్ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు.

జలహారతి కార్పొరేషన్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

రాష్ట్రంలో 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటి పునరుద్ధరణ ద్వారా 7.49 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీటి సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. ఇక ఎత్తిపోతల పథకాల నిర్వహణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ బాధ్యతను జలహారతి కార్పొరేషన్ ద్వారా చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదంటే సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. మరమ్మతుల కోసం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన పూర్తి చేసిన వెంటనే టెండర్లు పిలవాలని, ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలని సీఎం సూచించారు. వచ్చే జూన్ నాటికి అన్ని ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు.

ఇరిగేషన్ భూముల్లో 903.1 మెగావాట్ల సౌర విద్యుత్

జలవనరుల శాఖ పరిధిలో అందుబాటులో ఉన్న 5,565 ఎకరాల భూమిలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు 4,061 ఎకరాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా 877.3 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో 84 ప్రాంతాలను గుర్తించగా వాటిలో 110 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. దీని ద్వారా 25.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా 4,171 ఎకరాల భూమిని సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అధికారులు వివరించారు. కేవలం భూములకే పరిమితం కాకుండా కాలువలపై కూడా సౌర విద్యుత్, జలవిద్యుత్ ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ప్రణాళిక రూపొందించడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా ఆదాయం పొందే విధానాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. రవాణా, విద్యుత్ ఉత్పత్తి, సౌర విద్యుత్, వ్యవసాయ రంగాలను అనుసంధానం చేయడం ద్వారా సంపద సృష్టికి అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ తరహాలోనే జలవనరుల రంగంలోనూ వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల్లో ఉన్న విధంగానే సాగునీటి రంగంలోనూ నియంత్రణ వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గంగా-కావేరి అనుసంధానం వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా రవాణా, విద్యుత్, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావచ్చని, ఆయా రంగాలకు నీటి వినియోగంపై రెగ్యులేటరీ కమిషన్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు.

నిధులకు కొరత రానివ్వను... ప్రాజెక్టులు పూర్తవ్వాలి

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసిన సీఎం... నిర్దేశించుకున్న గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే రెండున్నరేళ్లలో ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

సీఐఐ సదస్సు వేదికగా 'కాఫీ-చాక్లెట' ముచ్చట

- యూఏఈ మంత్రికి అరకు కాఫీ అందించిన సీఎం చంద్రబాబు
- 'మీ చాక్లెట్లకు మా వద్ద కోకో లభిస్తుంది.. చాక్లెట్ ఫ్యాక్టరీ పెట్టేయండి!'
- నవ్వులు పూయించిన ముఖ్యమంత్రి సమయస్ఫూర్తి



విశాఖపట్నం (చైతన్యరథం): సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభానికి ముందు రోజు సాగర తీరం విశాఖలో నిర్వహించిన దౌత్య భేటీల్లో ఒక ఆసక్తికర ఉదంతం చోటుచేసుకుంది. పెట్టుబడుల సేకరణకు వేదికైన ఈ సమావేశాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సమయస్ఫూర్తి, చమత్కారం విదేశీ ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తనను కలిసేందుకు విచ్చేసిన యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రికి సీఎం చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రాంతాల ఖ్యాతి అయిన 'అరకు కాఫీ'ని అందించారు. కాఫీ రుచిని ప్రత్యేకంగా వివరిస్తూ... 'ఈ అరకు కాఫీ తాగిన ప్రతిసారీ మీరు మా రాష్ట్రాన్ని, ఇక్కడ పెట్టాల్సిన పెట్టుబడులను గుర్తు తెచ్చుకోవాలి" అని చమత్కరించారు.

చాక్లెట్ బాక్స్‌లోనూ పెట్టుబడుల కోణం!

ముఖ్యమంత్రి ఆతిథ్యానికి సంతోషించిన యూఏఈ మంత్రి... "మీరు మీ రాష్ట్రానికి చెందిన అరకు బ్రాండ్ కాఫీని నాకు అందించారు. బదులుగా మా దేశం నుంచి తెచ్చిన ఈ చాక్లెట్లను మీకు బహుమతిగా ఇస్తున్నాను" అంటూ చాక్లెట్ బాక్స్‌ను సీఎంకు అందించారు. ఆ చాక్లెట్లను అందుకుంటూ సీఎం చంద్రబాబు తక్షణం స్పందిస్తూ... "మీరు తెచ్చిన ఈ చాక్లెట్లకు కావలసిన నాణ్యమైన 'కోకో' మా రాష్ట్రంలో సమృద్ధిగా పండుతుంది. దాన్ని మీకు సరఫరా చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అంతేకాదు మీరు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటే, మా వద్ద లభించే కోకోతో ఇక్కడే ఒక చాక్లెట్ ఫ్యాక్టరీ కూడా నెలకొల్పవచ్చు" అని ప్రతిపాదించారు.

ఒక చిన్న చాక్లెట్ బాక్స్ ఇస్తే అందులోనూ రాష్ట్రానికి ఉపయోగపడే పెట్టుబడుల కోణాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించడంతో యూఏఈ మంత్రి బిగ్గరగా నవ్వుతూ... "చివరికి ఒక చాక్లెట్ బాక్స్‌లో కూడా మీరు పెట్టుబడుల అవకాశాన్ని చూస్తున్నారు!" అని ప్రశంసించారు. సమావేశంలో చోటుచేసుకున్న ఈ సరదా 'కాఫీ-చాక్లెట' సంభాషణ అక్కడ ఉన్న ప్రతినిధుల్లో నవ్వులు పూయించింది.



అబుల్ కలాం ఆజాద్‌కు సీఎం నివాళి

అమరావతి (చైతన్యరథం): స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ మొదటి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు.

విశాఖలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖలో రెండు రోజుల పాటు జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం నగరానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆయనకు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, కావలి గ్రీష్మలతో పాటు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ గోపాల్, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ తదితర ప్రముఖులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు.



















31st CII PARTNERSHIP SUMMIT 2026 | VISAKHAPATNAM Growth • Partnership • Prosperity | చైతన్యరథం



సింగపూర్ సహకారంతో విద్యా శాఖలో సామర్థ్యాల పెంపునకు కృషి

- **ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులకు సింగపూర్‌లో శిక్షణ**
- **సింగపూర్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు రాష్ట్రంలోని ఇతర ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి**
- **డిజిటల్ గవర్నెన్స్, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ శిక్షణలో సింగపూర్ సహకారం కోరిన మంత్రి నారా లోకేష్**
- **మంత్రులు, సంబంధిత శాఖల కార్యదర్శులకు కలిపి శిక్షణ ఇస్తే మెరుగైన సమన్వయం**
- **సంయుక్త కమిటీ నిర్ణయాల అమలుపై ఆరు నెలలకోసారి సమీక్షించాలని అధికారులకు సూచన**
- **అమరావతి సీఆర్డీఏ కార్యాలయంలో సింగపూర్-ఆంధ్రప్రదేశ్ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టాండింగ్ కమిటీ మూడో సమావేశం**



అమరావతి (చైతన్యరథం): సింగపూర్ ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర విద్యా శాఖలో అమలు చేస్తున్న సామర్థ్యాల పెంపు కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, ఈ సహకారాన్ని మరిన్ని రంగాలకు విస్తరించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతుల్లో శిక్షణతో పాటు ప్రభుత్వ అధికారులకు నాయకత్వ నైపుణ్యాలు, డిజిటల్ గవర్నెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో సింగపూర్ అనుభవాన్ని వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.

రాజధాని అమరావతిలోని ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో బుధవారం సింగపూర్–ఆంధ్రప్రదేశ్ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టాండింగ్ కమిటీ మూడో సమావేశం జరిగింది.

మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం సింగపూర్ ప్రతినిధులతో సమావేశమైంది. అమరావతిని ఆధునిక, సమగ్ర, సుస్థిర రాజధాని నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్, సింగపూర్ ప్రభుత్వాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలోని అంశాల అమలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, భవిష్యత్తు కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. గత రెండు సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించారు.

సింగపూర్ శిక్షణ ఫలాలు ప్రతి ఉపాధ్యాయుడికీ అందాలి

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన ఆరుగురు మంత్రులు, 37 మంది ఉపాధ్యాయులకు సింగపూర్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఇందుకు సింగపూర్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని వేసవి సెలవుల్లో సింగపూర్ పంపించి అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతుల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన ఉపాధ్యాయులు తమ అనుభవాన్ని, నేర్చుకున్న ఆధునిక బోధనా పద్ధతులను రాష్ట్రంలోని ఇతర ఉపాధ్యాయులతో పంచుకోవాలన్నారు. ఇందుకోసం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వేదికగా ఉపయోగించుకోవాలని, సింగపూర్ శిక్షణ ఫలాలు రాష్ట్రంలోని ప్రతి ఉపాధ్యాయుడికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యా శాఖలో సామర్థ్యాల పెంపు కార్యక్రమాలను మార్గదర్శకత్వం, దిశానిర్దేశం, పరిపాలన అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా అమలు చేయాలని మంత్రి పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాలు కేవలం కొద్దిమందికే పరిమితం కాకుండా విద్యా వ్యవస్థ మొత్తానికి ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని సూచించారు.

మంత్రులు, కార్యదర్శులకు కలిపి శిక్షణతో మెరుగైన సమన్వయం

సింగపూర్ సహకారంతో అమలు చేస్తున్న SAGE కార్యక్రమం కింద మంత్రులు, శాఖల కార్యదర్శులకు వేర్వేరుగా శిక్షణ ఇవ్వడం కంటే సంబంధిత మంత్రి, అదే శాఖ కార్యదర్శికి ఒకేసారి శిక్షణ ఇవ్వడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని లోకేష్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల విధాన నిర్ణయాలు, వాటి అమలులో సమన్వయం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, సివిల్ సర్వెంట్లకు నాయకత్వ లక్షణాలు, ఆధునిక పరిపాలనా విధానాలు, డిజిటల్ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ, పరస్పర అనుభవాల మార్పిడి కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరాన్ని వివరించారు.



డిజిటల్ గవర్నెన్స్‌లో సింగపూర్ అనుభవాన్ని వినియోగించుకుంటాం

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, రియల్ టైమ్ గవర్నెన్స్, సమీకృత డిజిటల్ వేదికల రూపకల్పన, కమాండ్ కంట్రోల్ సెంటర్ల నిర్వహణ, డేటా ఆధారిత నిర్ణయాల విషయంలో సింగపూర్ సహకారాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు. ఈ రంగాల్లో సహకారం అందించేందుకు సింగపూర్ సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో వరుస తుఫానుల కారణంగా కొన్ని కార్యక్రమాల అమలులో జాప్యం జరిగిందని వివరించారు. ఆ అవరోధాలను అధిగమించి ప్రతిపాదిత కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాల్లో రెండు ప్రభుత్వాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.

పురోగతిపై ఆరు నెలలకోసారి సమీక్ష

గత జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో తీసుకున్న కొన్ని నిర్ణయాల అమలులో జాప్యం జరిగిన అంశంపై కూడా సమావేశంలో చర్చించారు. ఇకపై కమిటీ ప్రతిపాదించిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిపై ప్రతి ఆరు నెలలకోసారి సమీక్షించాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. పక్కా ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో నిర్దేశిత లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమాల అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించినట్టు అధికారులు మంత్రికి వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలపై సింగపూర్ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ పరిపాలన, నాయకత్వ శిక్షణ వంటి రంగాల్లో సహకారానికి సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించారు.

సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఆర్థిక, ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్, సీసీఎలఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి, ఏపీసీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ గణేష్‌కుమార్, ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖల డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ప్రణాళికా శాఖ జాయింట్ సెక్రటరీ అనంత శంకర్, అదనపు కమిషనర్లు ఎ.భార్గవ్‌తేజ, అభిషేక్ కుమార్, కె.కార్తీక్, ఏడీసీఎల్ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి, ఆర్థిక శాఖ అదనపు డైరెక్టర్ దత్తి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్ ప్రతినిధి బృందానికి గన్ సియో హువాంగ్ నేతృత్వం వహించారు. ఈ బృందంలో సింగపూర్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్య, పరిశ్రమల శాఖలకు చెందిన ప్రతినిధులతో పాటు డాక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్ (సీనియర్ డైరెక్టర్, దక్షిణాసియా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా విభాగం), ఫెయిన్ యీ (డైరెక్టర్–ఇండియా), ఎలిజా అంగ్ (సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్–ఇండియా), జోసెఫ్ మంటో (అసిస్టెంట్ డైరెక్టర్–ఇండియా), సింగపూర్ కో–ఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టాయ్ లియన్ చియు, లిమ్ చీ కియా (డిప్యూటీ డైరెక్టర్), ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హో చీ హిన్, రీజినల్ డైరెక్టర్ జెసీ ఎన్జీ, చెన్నైలోని సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్, న్యూఢిల్లీలోని సింగపూర్ డిప్యూటీ హై కమిషనర్ సుమయా బకావి, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ ప్రతినిధి రీమస్ లియు, కాన్సుల్ శామ్యూల్ లోహ్, ఫస్ట్ సెక్రటరీ జోషువా హెచ్‌సీ లిమ్ తదితరులు పాల్గొన్నారు.

31st CII PARTNERSHIP SUMMIT 2026 ® VISAKHAPATNAM Growth • Partnership • Prosperity
చైతన్యరథం





నాయుడుపేటలో రూ.4వేల కోట్లతో ఇండో-కొరియన్ బ్యాటరీ విడిభాగాల తయారీ పరిశ్రమ

- తిరుపతి జిల్లా నాయుడుపేటలో భారీ బ్యాటరీ ముడి పదార్థాల తయారీ ప్లాంట్ ఏర్పాటు
- కార్బన్ రిసోర్సెస్, దక్షిణ కొరియాకు చెందిన కాస్మో ఏఎం అండ్ టీ సంయుక్త భాగస్వామ్యంతో పరిశ్రమ
- మూడు దశల్లో 230 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు
- 2031 నాటికి పూర్తిస్థాయిలో ఉత్పత్తి
- ఏటా 1.8 లక్షల టన్నుల చొప్పున రెండు రకాల బ్యాటరీ ముడిపదార్థాల తయారీ
- 700 మందికి ప్రత్యక్షంగా... 3,500 నుంచి 5వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు
- బ్యాటరీ పరీక్షలు, రీసైక్లింగ్ పరిశోధనలకు ఐఐటీ తిరుపతితో కలిసి పనిచేయాలని మంత్రి నారా లోకేష్ సూచన
- దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీకి ఏపీని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం: లోకేష్



230 ఎకరాల్లో మూడు దశల్లో పరిశ్రమ ఏర్పాటు

నాయుడుపేటలో 230 ఎకరాల విస్తీర్ణంలో దక్షిణ కొరియాకు చెందిన కాస్మో సంస్థ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర అవసరాలకు వినియోగించే లిథియం అయాన్ బ్యాటరీల తయారీలో కీలకమైన ఫెరిక్ ఫాస్ఫేట్, లిథియం ఐరన్ ఫాస్ఫేట్ క్యాథోడ్ పదార్థాలను ఇక్కడ ఉత్పత్తి చేయనున్నారు. మూడు దశల్లో పరిశ్రమ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశలో ఏటా 30 వేల టన్నుల ఫెరిక్ ఫాస్ఫేట్, 30వేల టన్నుల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ ఉత్పత్తి సామర్థ్యంతో 2028 మధ్య నాటికి ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2031 నాటికి మూడో దశను పూర్తి చేసి పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రణాళిక రూపొందించారు.

మూడు దశలు పూర్తయిన తర్వాత ఏటా 1.8 లక్షల టన్నుల ఫెరిక్ ఫాస్ఫేట్, మరో 1.8 లక్షల టన్నుల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ తయారు చేయనున్నారు. ఇందులో ఏటా 1.3 లక్షల టన్నుల వరకు ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంది. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి అక్టోబరు 16న అమరావతిలోని ఎసఆరఎం యూనివర్సిటీలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ నెల 6వ తేదీన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది.

బ్యాటరీ తయారీ రంగంలో ఏపీకి కీలక పెట్టుబడి

కార్బన్ కాస్మోలో భాగస్వామిగా ఉన్న కోల్‌కతాకు చెందిన కార్బన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటికే విజయనగరం జిల్లా బొబ్బిలిలో కాల్సిన్డ్ పెట్రోలియం కోక్ తయారీ పరిశ్రమను నిర్వహిస్తోంది. మరో భాగస్వామి అయిన దక్షిణ కొరియాకు చెందిన కాస్మో ఏఎంఅండ్‌టీ బ్యాటరీ క్యాథోడ్ పదార్థాల తయారీలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సంస్థ. శామ్‌సంగ్ ఎస్‌డీఐ, ఎల్‌జీ ఎనర్జీ సొల్యూషన్ వంటి ప్రముఖ బ్యాటరీ తయారీ కంపెనీలకు ఈ సంస్థ ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. ఈ రెండు సంస్థల భాగస్వామ్యంతో నాయుడుపేటలో ఏర్పాటు కానున్న పరిశ్రమ దేశీయంగా బ్యాటరీల తయారీకి అవసరమైన కీలక ముడి పదార్థాల లభ్యతను పెంచడంతో పాటు విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు దోహదపడనుంది.

ఐఐటీ తిరుపతితో కలిసి పరిశోధనలు చేపట్టాలి

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ బ్యాటరీల తయారీతో పాటు పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బ్యాటరీ క్యాథోడ్ పదార్థాల నాణ్యత పరీక్షలు, వినియోగించిన బ్యాటరీల నుంచి విలువైన పదార్థాలను తిరిగి సేకరించే రీసైక్లింగ్ సాంకేతికతపై పరిశోధనల కోసం ఐఐటీ తిరుపతితో కలిసి ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కాస్మో సంస్థ ప్రతినిధులను కోరారు.

ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీకి ఏపీని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం: మంత్రి లోకేష్

"కార్బన్ కాస్మో సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉంది. భారత్–దక్షిణ కొరియా భాగస్వామ్యంతో ప్రపంచస్థాయి బ్యాటరీ క్యాథోడ్ తయారీ సాంకేతికత నాయుడుపేటకు రానుంది. దేశంలో బ్యాటరీల తయారీకి అవసరమైన కీలక ముడిపదార్థాల సరఫరాలో ఉన్న లోటును భర్తీ చేసేందుకు ఈ పరిశ్రమ దోహదపడుతుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం. ఈ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

సమావేశంలో కార్బన్ రిసోర్సెస్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అభినవ్ కుమార్ జలాన్, కాస్మో ఏఎం అండ్ టీ వైస్ ప్రెసిడెంట్ డ్యూక్ క్యూ పార్క్, జనరల్ మేనేజర్ బ్యోంగ్‌డే కిమ్, అమన్ కపూర్, సియుంగ్ జోంగ్ లీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంగా తీర్చిదిద్దుతాం: లోకేష్

విశాఖపట్నం (చైతన్యరథం): తిరుపతి జిల్లా నాయుడుపేటలో రూ.4వేల కోట్ల పెట్టుబడితో భారీ బ్యాటరీ ముడిపదార్థాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. భారత్‌కు చెందిన కార్బన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణ కొరియాకు చెందిన కాస్మో ఏఎం అండ్ టీ కంపెనీలు సంయుక్తంగా ఈ పరిశ్రమను నెలకొల్పనున్నాయి. కార్బన్ కాస్మో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 700 మందికి, పరోక్షంగా మరో 3,500 నుంచి 5వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో బుధవారం రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో కార్బన్ కాస్మో సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఏర్పాటు, పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్యం, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై చర్చించారు.



విశాఖ వేదికగా రూ.11 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం!

- సీఐఐ భాగస్వామ్య సదస్సుతో 2.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు
- ఏపీకి మళ్లీ పారిశ్రామిక వైభవం.. విశాఖలో పెట్టుబడుల జాతర
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో పెట్టుబడుల పరుగులు
- మంత్రి లోకేష్ చొరవతో పరిశ్రమలకు కొత్త ఊతం.. యువతకు ఉద్యోగాల భరోసా
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం (చైతన్యరథం): ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలకు ఆతిథ్యమిచ్చేందుకు విశాఖ నగరం సర్వసన్నద్ధమైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్–2026 రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కీలక వేదికగా నిలవనుందని పేర్కొన్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొననున్నారని తెలిపారు.

ఈ సదస్సు ద్వారా సుమారు రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోందని, దాదాపు 3,800 అవగాహన ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని పల్లా వెల్లడించారు. 58 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటుండటం విశాఖకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకొస్తుందని పేర్కొన్నారు.

ప్రపంచ దిగ్గజ కంపెనీల చూపు ఏపీ వైపు

కియా మోటార్స్, రెన్యూ, మాండెలెజ్ ఇండియా, సెయింట్ గోబెయిన్, నాల్కో, లెవిస్టా వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు సదస్సులో పాల్గొననున్నారు. అంతరిక్ష సాంకేతిక రంగానికి చెందిన హాథర్ రాకెట్స్, అగ్నికుల్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, స్కైరూట్ సంస్థల ప్రతినిధులు కూడా భాగస్వాములు కానున్నారు. ఆటోమొబైల్, పునరుత్పాదక ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలు, తయారీ, సాంకేతిక రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చలు జరగనున్నాయని పల్లా తెలిపారు.

గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు

విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్‌తో పాటు మరిన్ని డేటా సెంటర్లు ఏర్పాటు కానుండటం ఐటీ రంగానికి కొత్త ఊపునిస్తుందని పల్లా పేర్కొన్నారు. గూగుల్ సంస్థ సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడైన నేపథ్యంలో, విశాఖ అంతర్జాతీయ డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా ఎదిగే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ పెట్టుబడులు ఇతర సాంకేతిక, సాఫ్ట్‌వేర్ సంస్థలను కూడా విశాఖ వైపు ఆకర్షించే అవకాశం ఉందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ తక్కువ విద్యుత్ వినియోగం, కనిష్ఠ నీటి వినియోగంతో గ్రీన్ డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ కేంద్రాలు విశాఖలో బలమైన ఐటీ, డిజిటల్ ఎకోసిస్టమ్ నిర్మాణానికి దోహదపడతాయని పేర్కొన్నారు.



గొడ్డలి పార్టీ పాలనలో దెబ్బతిన్న బ్రాండ్..

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర పారిశ్రామిక రంగం ఒడిదుడుకులు ఎదుర్కొందని, జగన్ రెడ్డి ప్రభుత్వ విధానాలపై పెట్టుబడిదారుల్లో అనిశ్చితి నెలకొందని పల్లా విమర్శించారు. గతంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పినప్పటికీ, వాటి అమలు, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనపై స్పష్టత అవసరమన్నారు.

ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక రాయితీలు, సంస్థల అవసరాలకు అనుగుణంగా ప్రోత్సాహకాలు, వేగవంతమైన అనుమతుల విధానాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. వ్యాపార నిర్వహణలో వేగం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు రాష్ట్రానికి అనుకూలతలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, యువతకు ఉపాధి కల్పనపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. ఆయన చేపడుతున్న కార్యాచరణ యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశాలను కూడా విస్తరించనుందని తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖ సదస్సు దిక్సూచి

సీఐఐ సమ్మిట్ ద్వారా విశాఖపట్నంతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు పారిశ్రామిక అవకాశాలు విస్తరించే వీలుందని పల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త పరిశ్రమలు, అనుబంధ సంస్థలు, రవాణా, లాజిస్టిక్స్, సేవారంగాల విస్తరణతో ఉత్తరాంధ్ర యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. విశాఖను ఐటీ, తయారీ, అంతరిక్ష సాంకేతికత, డిజిటల్ రంగాలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు.

గతంలో నిర్వహించిన ఐదు ప్రాంతీయ సదస్సుల ద్వారా రూ.86 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు పేర్కొన్న పల్లా, తాజా సీఐఐ సమ్మిట్ ద్వారా మరిన్ని పెట్టుబడి ప్రతిపాదనలు కార్యరూపం దాల్చాలని ఆకాంక్షించారు. విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్రలో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించి, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా ఈ సదస్సు ఫలితాలు ఉండాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

సత్వర కేంద్ర సాయమే అన్నదాతకు ఆక్సిజన్!

ఆంధ్రప్రదేశ్‌లో వరుస తుపాన్లతో కుదేలైన వ్యవసాయ రంగం.. కోలుకోలేని నష్టాల్లో రైతాంగం.. సత్వరం ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం. తుపాన్లతో తల్లడిల్లుతున్న ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి ఇప్పుడు కావాల్సింది హామీలు కాదు. చేతికి అందే ఆర్థిక సాయం. ప్రకృతి సృష్టించిన విలయానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయం ఉపశమనంగా మారాలి. రైతు మళ్లీ పొలంలోకి దిగి ధైర్యంగా నాగలి పట్టే పరిస్థితి రావాలి. అందుకు కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఉదారంగా స్పందించి ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించాలి. రాష్ట్ర ప్రభుత్వ సహాయక చర్యలకు అవసరమైన నిధులు సమకూర్చాలి. అన్నదాతకు అందించే ప్రతి రూపాయి రేపటి ఆహార భద్రతకు పెట్టుబడి. ఆ పెట్టుబడిని అందించడంలో జాప్యం చేయకుండా కేంద్రం తక్షణమే స్పందించాలి. సత్వర కేంద్ర సాయమే అన్నదాతకు అసలైన ఆక్సిజన్ అవుతుంది.దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు ప్రకృతి వైపరీత్యాలు శాపంగా మారుతున్నాయి. ఆరుగాలం కష్టపడి, రెక్కలు ముక్కలు చేసుకుని, అప్పులతో సాగు చేసిన పంట కళ్ల ముందే నీటిపాలైతే ఆ రైతు గుండె ఎంతగా విలవిలలాడుతుందో మాటల్లో చెప్పలేం. ఒకవైపు తుపాన్ల బీభత్సం, వరదలు, మరోవైపు కరువు రైతు జీవితాన్ని అగాధంలోకి నెట్టేస్తున్నాయి. ప్రకృతితో పోరాడి పంటను పండించే రైతన్నకు ఆపద సమయంలో అందాల్సిన ఆర్థిక చేయూత కూడా సకాలంలో అందక పోతే రైతు పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. అందుకే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అన్నదాతలకు కావాల్సింది కేంద్రప్రభుత్వ తక్షణ ఆర్థిక సహాయం. రాష్ట్ర ప్రభుత్వ బరోసాకు తోడుగా కేంద్రప్రభుత్వం ఉదారంగాస్పందించి ప్రత్యేక ఆర్థిక సాయం అందించాల్సిన సమయం ఇది.

అర్నబ్, మురసు రెండు తుపాన్ల ప్రభావం వల్ల పొలాల్లో నిలిచిన నీరు, నేలకొరిగిన వరి చేలు, దెబ్బతిన్న ఉద్యాన పంటలు, కొట్టుకు పోయిన ఆక్వా చెరువులు అన్నదాతల ఆశలను ఆవిరి చేశాయి. రాష్ట్ర ప్రభుత్వ తాజా అధికారిక సమీక్ష వివరాల ప్రకారం అర్నబ్, మురసు తుపాన్ల కారణంగా 4.61 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, మరో 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. లక్షలాది మంది రైతులు నష్టాల బారినపడ్డారు. అర్నబ్ ప్రభావంతోనే 3.27 లక్షల హెక్టార్లకు పైగా వ్యవసాయ పంటలు దెబ్బతినగా, మురసు కారణంగా మరో 1.33 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. ఈ రెండు తుపాన్ల నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక అంచనాలు రూపొందించి కేంద్రానికి నివేదికలు అందించి ఆర్థిక సాయం కోరింది. అర్నబ్ తుపాను వల్ల జరిగిన నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.4,764 కోట్లుగా అంచనా వేసి కేంద్ర బృందానికి వివరించింది. మురసు తుపాను నష్టంపై మరో ప్రాథమిక అంచనాలో రూ.1,919.59 కోట్ల నష్టం జరిగినట్లు నివేదిక ఇచ్చి తక్షణ మధ్యంతర సాయం కోరింది. ఈ రెండు అంచనాలను కలిపి చూస్తే రాష్ట్రంపై పడిన ఆర్థిక భారం ఎంత పెద్దదో అర్థమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో సహాయక చర్యలు చేపట్టడం, నష్టాల అంచనా వేయడం, బాధితులకు తక్షణ ఉపశమనం కల్పించడం ఎంత అవసరమో, కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ విపత్తు నిర్వహణ వ్యవస్థ ద్వారా తగిన ఆర్థిక సహాయం అందించడం అంతే అవసరం. రాష్ట్ర ఆదాయ వనరులకే పరిమితమై ఇంతటి భారీ నష్టాన్ని భర్తీ చేయడం సాధ్యం కాదు. ఇప్పటికే రోడ్లు, విద్యుత్ వ్యవస్థలు, సాగునీటి వనరులు, గృహాలు, పశుసంపద, ఆక్వా రంగం తీవ్రంగా దెబ్బతిన్నాయి. వీటన్నింటి పునరుద్ధరణకు భారీ నిధులు అవసరం. ఈ నేపథ్యంలో కేంద్రం నిబంధనల ప్రకారం అర్హమైన సహాయాన్ని వేగంగా మంజూరు చేయడంతో పాటు, తక్షణ మధ్యంతర ఆర్థిక సాయం అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం వుంది.

తుపానులు విరుసుకు పడిన వెంటనే ఎన్నడూ లేనివిధంగా కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాలను పరిశీలించడం అభినందించదగిన పరిణామమే. కానీ పరిశీలనలతోనే రైతుల బాధలు తీరవు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన వెంటనే నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి. ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు సహాయం అందించడంలో జాప్యం జరిగితే రైతుకు కలిగే నష్టం మరింత పెరుగుతుంది. పంట నష్టపరిహారం సీజన్ ముగిసిన తర్వాత కాకుండా, తదుపరి సాగుకు పెట్టుబడి పెట్టాల్సిన సమయానికే అందాలి. అప్పుడే ఆ సాయం రైతుకు నిజమైన ఆక్సిజన్ అవుతుంది. విపత్తు సమయంలో ప్రాణ రక్షణ ఎంత ముఖ్యమో, విపత్తు అనంతరం రైతు ఆర్థిక పునరుద్ధరణ కూడా అంతే ముఖ్యం. విపత్తు చేసిన నష్టం తర్వాత రైతు జీవితాలను తిరిగి నిలబెట్టడం అతి పెద్ద బాధ్యత. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రం దృష్టికి నష్టాల తీవ్రతను తీసుకెళ్లింది. ఇక కేంద్రం వేగంగా నిర్ణయం తీసుకుని ఆర్థిక సహాయం అందించాల్సి ఉంది. విపత్తు సాయం అనేది రాష్ట్రానికి చేసే ఉపకారం కాదు. ప్రజల పునరావాసం కోసం సమాఖ్య వ్యవస్థలో నిర్వర్తించాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ప్రకృతి విపత్తుల సమయంలో రైతు ఒంటరివాడనే భావన కలగకూడదు. అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మస్థైర్యం కోల్పోయే పరిస్థితి రాకూడదు. అన్నదాత కన్నీరు దేశానికి మంచిది కాదు. రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. వ్యవసాయం బతికితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలబడుతుంది. ఆర్థిక వ్యవస్థ బలపడితేనే దేశం సుభిక్షంగా ఉంటుంది.

దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌ను తుపాన్లు వెంటాడుతూనే ఉన్నాయి. సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందంటే చాలు.. రైతాంగం గుండెల్లో గుబులు మొదలవుతోంది. ఎప్పుడు ఏ తుపాను విరుచుకుపడుతుందో, ఎన్ని ఎకరాల పంటను నీటి పాలు చేస్తుందో, ఎన్ని కుటుంబాలను నిరాశ్రయులను చేస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంటోంది. తీర ప్రాంతానికి ప్రకృతి వైపరీత్యాలు కొత్త కాకపోయినా, వాటి తీవ్రత, వరుసగా విరుచుకుపడుతున్న వైనం వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఒక తుపాను నుంచి తేరుకునేలోపే మరో తుపాను ముంచుకొస్తోంది. పెట్టిన పెట్టుబడి, రైతుల కష్టం నీటి పాలు అవుతుంది .1977 దివిసీమ ఉప్పెన సృష్టించిన మహావిలయం నుంచి 1990 నాటి భీకర తుపాను వరకు తెలుగు నేల ఎన్నో ప్రకృతి విపత్తులను చవిచూసింది. వేలాది ప్రాణాలు గాలిలో కలిశాయి. లక్షలాది కుటుంబాలు వీధిన పడ్డాయి. 2014 హుదూద్ విశాఖను అతలాకుతలం చేయగా, 2018 తిత్లీ శ్రీకాకుళం జిల్లాకు తీరని నష్టాన్ని మిగిల్చింది. 2020 నివార్, 2021 గులాబ్, 2022 అసని, 2023 మిచౌంగ్, 2024 ఫెంగల్, 2025 మొంథా తుపాన్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలపై ప్రభావం చూపాయి. ప్రతి విపత్తు వెనుక రైతు కన్నీటి గాథే మిగిలింది. ఒకప్పుడు ప్రకృతి వైపరీత్యం వస్తే కొన్ని నెలలపాటు కోలుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు వరుస విపత్తులు రైతుకు కోలుకునే అవకాశమే ఇవ్వడం లేదు.ఈ ఏడాది అర్నబ్, మురసు తుపాన్ల ప్రభావం కూడా రాష్ట్ర వ్యవసాయ రంగం పై తీవ్రంగా పడింది. ఒక వైపు వర్షాభావ పరిస్థితులను అధిగమించి సాగు చేసిన రైతాంగం, మరో వైపు తుపాన్లు, వరదల దెబ్బకు విలవిల లాడింది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండించి చేతికి వచ్చిన పంటలు నీటి పాలు అయి అన్నదాతల ఆశలు ఆవిరి అయిన నేపథ్యంలో నిబంధనల ప్రకారం అర్హమైన సహాయాన్ని వేగంగా మంజూరు చేయడంతో పాటు, తక్షణ మధ్యంతర ఆర్థిక సాయం అందించి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం వుంది.

- నీరుకొండ ప్రసాద్

పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ..

యువతకు ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం

- **వైజాగ్ సీఐఐ సమ్మిట్ ద్వారా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం**
- **దేశం మొత్తం చూపు మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు**
- **దీనికంతటికీ కారణం 'బ్రాండ్ సీబీఎన్'**
- **యువతకు భరోసానిస్తూ నిజమైన 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్'గా నిలిచిన మంత్రి నారా లోకేష్**
- **రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ గతంలో జగన్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు**
- **యూట్యూబ్ ఛానళ్లు, అప్పడాలు, బొబ్బట్ల తయారీ కంపెనీలతో ఎంవోయూలతో యువతకు మోసం**
- **ఎంపీ చింతకాయల విజయ్**

అమరావతి (చైతన్యరథం): విశాఖపట్నం వేదికగా జరుగుతున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) పార్టనర్‌షిప్ సమ్మిట్‌పై ప్రస్తుతం దేశవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు, యువత ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఎంపీ చింతకాయల విజయ్ పేర్కొన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో జరిగే ఈ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి భారీ ప్రాజెక్టులు రాబోతున్నాయా అని దేశం మొత్తం ఉత్కంఠగా గమనిస్తోందన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేడు దేశం మొత్తం వైజాగ్ సీఐఐ సమ్మిట్ వైపు ఆశగా చూస్తోందంటే దానికి కారణం ఒక్కటే.. మన రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్నది 'బ్రాండ్ చంద్రబాబు నాయుడు' అన్నారు. ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించే పేరు చంద్రబాబు. ఆయన విజన్, పాలసీలపై ఉన్న నమ్మకమే పెట్టుబడిదారులను మళ్లీ ఆంధ్రప్రదేశ్ వైపు నడిపిస్తోంది. మంత్రి నారా లోకేష్‌ని యువత ఎందుకు 'జాబ్ క్రియేటర్ ఇన్‌చీఫ్'గా పిలుచుకుంటుందో అందరికీ తెలుసు. యువగళం పాదయాత్రలో ఆయన ఉక్కు పిడికిలి బిగించి నడిచిన ప్రతి అడుగులోనూ నిరుద్యోగ యువతకు కొండంత ధైర్యం కనిపించింది. మా భవిష్యత్తు కోసం, మా ఉద్యోగాల కోసం ఒక యువ నాయకుడు పోరాడుతున్నాడనే బలమైన భరోసా నాడు రాష్ట్ర యువతలో వ్యక్తమైంది. ఆ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి, నేడు రాష్ట్రాన్ని ఉద్యోగాల కేంద్రంగా మార్చేందుకు ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారు. యువగళం పాదయాత్రలో నాడు అనంతపురంలో కియా కార్ల పరిశ్రమ ఎదుట నిలబడి.. ఈ పరిశ్రమను మేమే తీసుకొచ్చాం, చంద్రబాబు నాయుడు బ్రాండ్ ఇమేజ్‌తో, తెలుగుదేశం పార్టీయే సాధించింది' అని గర్వంతో ధైర్యంగా చెప్పారు. ఎందుకంటే ఆ స్పష్టత, ఆ నిజాయితీ, ఆ పారదర్శకత ఒక్క తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోనే కనిపిస్తాయి. చేసిన పనిని నిక్కచ్చిగా చెప్పుకునే నైతిక బలం మాకుంది. రాష్ట్రంలో మళ్లీ పరిశ్రమల శకం ప్రారంభమైందని, చంద్రబాబు నాయుడు అనుభవం, నారా లోకేష్ చొరవతో విశాఖ సీఐఐ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చబోతోందని, యువతకు లక్షలాది ఉపాధి అవకాశాలు తెచ్చిపెట్టబోతోందని ఎంపీ విజయ్ ధీమా వ్యక్తం చేశారు.

చంద్రబాబు, లోకేష్ చొరవతోనే ఏపీకి పెట్టుబడుల వెల్లువ

విశాఖ సీఐఐ సమ్మిట్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యంతో ముందడుగు వేస్తోందని విజయ్ వెల్లడించారు. గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అబద్ధాలు, దోపిడీలతో రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చారని, నేడు కూటమి ప్రభుత్వంలో వాస్తవ గణాంకాలతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ ప్రజలను దారుణంగా మోసం చేశారు. సమ్మిట్ల పేరిట రూ.72 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసి, ఒక్క రూపాయి పెట్టుబడి గ్రౌండ్ చేయకుండా యూట్యూబ్ ఛానళ్లతో ఒప్పందాలు చేసుకున్న దౌర్భాగ్య పాలన నడిచింది. అప్పటి పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ అసెంబ్లీ సాక్షిగా అప్పడాలు, బొబ్బట్ల కంపెనీలతో ఎంఓయూలు చేశామని చెప్పడం హాస్యాస్పదం. ఆ ఐదేళ్లలో నేరాలు పెరిగి, నిరుద్యోగం 24 శాతానికి ఎగబాకింది. ఉపాధి లేక దాదాపు 4,100 మంది బలవన్మరణాలకు పాల్పడే దుస్థితిని వైసీపీ ప్రభుత్వం తెచ్చిపెట్టింది. నేడు సీబీఎన్ బ్రాండ్ ఇమేజ్, కూటమి ప్రభుత్వ విశ్వసనీయతతో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. 2025-26లో దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఏపీ ఏకంగా 25.3 శాతం వాటాను సొంతం చేసుకుంది. ఒడిశా (13.1%), ఆర్థిక రాజధాని మహారాష్ట్ర (12.8%), తెలంగాణ (9.5%) కంటే ఎంతో ముందుంజలో ఉన్నాం. 2026 మొదటి త్రైమాసికంలోనూ (జనవరి-మార్చి) 18 శాతం పెట్టుబడులతో దేశంలో రెండో స్థానంలో నిలిచాం. నెంబర్లతో సహా నిరూపిస్తున్నాం ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని ఎంపీ విజయ్ స్పష్టం చేశారు.



జీడీ నెల్లూరులో పుట్టిన సంకల్పం..

మంత్రి నారా లోకేష్‌ని 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్' అని ఊరికే అనడం లేదు. యువగళం పాదయాత్రలో చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో ఒక సాధారణ మహిళ వద్ద రోడ్డు పక్కన యువనేత లోకేష్ టిఫిన్ చేసినప్పుడు, ఆమె.. 'నా కొడుకు మాస్టర్స్ చేశాడు, వాడికి ఉద్యోగం ఇప్పించన్నా' అని కన్నీటితో అడిగింది. ఆ తల్లి ఆవేదన నుంచే రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇవ్వాలనే దృఢ సంకల్పం పుట్టింది. ఆ లక్ష్యమే నేడు భారీ ఎత్తున పరిశ్రమలను ఏపీకి రప్పిస్తోంది. సుమారు రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకుంటే, ఇప్పటికే దాదాపు రూ.11 లక్షల కోట్ల ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయి. కేవలం ఎంఓయూలకే పరిమితం కాకుండా, పరిశ్రమలు కచ్చితంగా స్థాపించే వారితోనే ఒప్పందాలు చేసుకుంటున్నాం. ఒకే ఒక్క వాట్సాప్, జూమ్ కాల్‌తో 'ఆర్సెలర్ మిట్టల్' లాంటి దిగ్గజ సంస్థను ఒప్పించిన ఘనత యువనేత లోకేష్‌ది. పరిశ్రమల అనుమతులకు సింగిల్ డెస్క్ విధానాన్ని తెచ్చి, పారిశ్రామికవేత్తలు మెసేజ్ పెట్టిన నిమిషాల్లోనే స్పందిస్తూ భరోసా కల్పిస్తున్నారు. పరిశ్రమలకు తక్కువ ధరకు భూములు ఇస్తుంటే అర్థం లేని విమర్శలు చేసిన వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పారు. పరిశ్రమలు వస్తేనే లక్షలాది ఉద్యోగాలు వస్తాయనే విజ్ఞత చంద్రబాబు విధానాల్లో ఉంది. అందుకే విశాఖ ప్రజలు కూటమి నాయకత్వాన్ని నమ్మి, ఏకంగా 2,50,000 పైచిలుకు భారీ మెజారిటీతో మేయర్‌ను గెలిపించారు. రాష్ట్ర యువతకు బంగారు భవిష్యత్తును అందిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ఎంపీ విజయ్ పేర్కొన్నారు.

ప్రాంతీయ సదస్సులతో సమగ్ర ప్రగతి..

విశాఖ వేదికగా జరుగుతున్న సీఐఐ సమ్మిట్‌లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యంతో ముందడుగు వేయడమే కాకుండా, రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో ముందస్తుగా ప్రాంతీయ సదస్సులు నిర్వహించి అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. సంపద సృష్టి, తలసరి ఆదాయం పెంపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు పక్కా విజన్‌తో నేడు రాష్ట్ర జీఎస్డీపీ రికార్డు స్థాయిలో 8.51 శాతానికి చేరింది. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. ఒక ప్రాంతం మాత్రమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పౌరుడి తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే అధికంగా పెరగాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోంది. విశాఖ, కాకినాడ, అనంతపురం, తిరుపతిలలో ప్రాంతీయ సదస్సుల ద్వారా సుమారు రూ.79,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, పారిశ్రామికవేత్తలు చంద్రబాబు బ్రాండ్‌పై ఉంచిన నమ్మకంతో ఏకంగా రికార్డు సమయంలో రూ.85,650 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఒప్పందాలు కుదిర్చుకుంది. వీటి ద్వారా 1.56 లక్షల ఉద్యోగాలు మన యువతకు రానున్నాయి. ఉత్తరాంధ్రలో గూగుల్ డేటా ఏఐ సెంటర్ ఏర్పాటయ్యే స్థాయికి నేడు రాష్ట్రం ఎదిగింది. రెన్యూ ఎనర్జీ రంగంలో ప్రీమియర్ ఎనర్జీ గ్రూప్ కేవలం 18 నెలల్లోనే ప్రాజెక్టును గ్రౌండ్ చేసి దేశంలోనే రికార్డు సృష్టించింది. ఒకవైపు పారిశ్రామిక ప్రగతి సాధిస్తూనే, మరోవైపు ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ గోదావరి జలాలను అందించారు. గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేసి నీటిని తరలించిన దృశ్యాన్ని ఎవరూ మర్చిపోలేరు. అందుకే ప్రముఖ జాతీయ పత్రిక ఎకనామిక్ టైమ్స్ చంద్రబాబుని 'వాటర్ మ్యాన్'గా కీర్తించింది. చంద్రబాబు నాయుడు బ్రాండ్ ఇమేజ్ ఈ రోజు కొత్తగా పుట్టింది కాదు. 1999లోనే 'టైమ్స్' మ్యాగజైన్ ఆయనను 'సౌత్ ఏషియన్ ఆఫ్ ది ఇయర్'గా ప్రకటించింది. ఒరాకిల్ కార్పొరేషన్, ప్రాఫిట్ మ్యాగజైన్‌లు 'సెవెన్ వర్కింగ్ వండర్స్ అరౌండ్ ది వరల్డ్' జాబితాలో చేర్చాయి. ఇండియా టుడే ఆయనను 'ఐటీ ఇండియన్ ఆఫ్ ది మిలీనియం'గా కొనియాడింది. అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్ర గవర్నర్ జిమ్ ఎడ్గార్ స్వయంగా 'నాయుడు డే'గా ప్రకటించిన ఘనత ఆయన సొంతం. ఆ అంతర్జాతీయ పరపతి, ట్రాన్స్‌పరెన్సీ వల్లే నేడు ఎకనామిక్ టైమ్స్ నుంచి న్యూయార్క్ మ్యాగజైన్ల వరకు ఆంధ్రప్రదేశ్ ప్రగతిని ప్రశంసిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో యూట్యూబర్లు, పేమెంట్ యాంకర్లతో నకిలీ సంతకాలు చేయించి రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులంటూ ప్రజలను మోసం చేశారు. చివరికి కనీసం లోపల కాగితం కూడా లేని ఖాళీ ఫైల్ ఇచ్చిపుచ్చుకుంటూ, అది బీటూబీ ఉత్తుత్తి ఎంఓయూ అని నవ్వుకున్న విషయాన్ని రాష్ట్రం ఇంకా మర్చిపోలేదు. జాబ్ క్యాలెండర్ అంటూ యువత జీవితాలతో చెలగాటమాడారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో మంత్రి లోకేష్ చొరవతో మెగా డీఎస్సీ నిర్వహించడమే కాక, మరో డీఎస్సీ ప్రకటించి, నిర్దిష్ట జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని అత్యంత పారదర్శకంగా చేపడుతున్నాం. అమరావతి నిర్మాణం అయినా, పోలవరం పనులైనా, పరిశ్రమల స్థాపనైనా.. ప్రతి అడుగు రాష్ట్ర భవిష్యత్తును, యువత బంగారు భవితను దృష్టిలో ఉంచుకునే పడుతోందని ఎంపీ విజయ్ ఉద్ఘాటించారు.

రాష్ట్రానికి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు

ఆంధ్రప్రదేశ్ సమగ్ర పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా-ఐటీ శాఖల మంత్రి లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తోందని విజయ్ స్పష్టం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కళ్లముందు కనిపిస్తున్న కంపెనీల పేర్లతో సహా నిరూపిస్తున్నామని, దీనిపై చర్చకు రావాలని ఆయన ప్రతిపక్షానికి సూటిగా సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, తద్వారా 24 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే పక్కా లక్ష్యంతో అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే సుమారు రూ.11 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు నేరుగా గ్రౌండ్ అయ్యాయి. వీటి ద్వారా ఏకంగా 15 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి రాబోతున్నాయి. మరో రూ.22.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వివిధ దశల్లో పైప్‌లైన్‌లో ఉన్నాయి. ఇదీ కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి. రాష్ట్రంలోకి వచ్చిన సంస్థల జాబితా చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. గూగుల్ ఏఐ హబ్, 12 బిలియన్ డాలర్ల గ్రీన్ ఎనర్జీ ఎంఓయూతో బ్రూక్‌ఫీల్డ్, రిలయన్స్ డేటా సెంటర్, డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్, హిందూజా గ్రూప్, ఉర్లా క్లస్టర్స్, కాగ్నిజెంట్, లూలూ గ్రూప్, సత్వ వాంటేజ్ టెక్, టీసీఎస్, టీసీఎస్ హైపర్ వాల్ట్, వరుణ్ హాస్పిటాలిటీ, ముత్తూట్ ఫిన్‌కార్ప్, డెలాయిట్, ఇన్ఫోసిస్, యాక్సెంచర్, ఏఎన్ఎస్ఆర్ జిసిసి, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్, ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్, రెన్యూ గ్రీన్ డేటా సెంటర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్, జీఎంఆర్ ఏవియేషన్ హబ్, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, కోరమాండల్ ఇంటర్నేషనల్, వారీ క్లీన్ ఎనర్జీ, ఏఎం గ్రీన్, మోహన్ స్పిన్‌టెక్స్, బీపీసీఎల్ రిఫైనరీ, ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, వీపీఆర్ మైనింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, అపోలో టైర్స్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎల్‌జీ వెండర్స్, ప్రీమియర్ ఎనర్జీస్, డైకిన్ విస్తరణ, మునోత్ లిథియం బ్యాటరీ, స్కైరూట్ ఏరోస్పేస్, నెక్సస్ లాజిస్టిక్స్ పార్క్, హిండాల్కో, రిలయన్స్ సోలార్, పుట్టపర్తిలో డీఆర్‌డీఓ ఏఎంసీఏ ఫైటర్ జెట్ సెంటర్, కియా ఫేజ్-2 ఎక్స్‌పాన్షన్, భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్ఎఫ్ఎల్, టాటా పవర్, రెన్యూ విక్రమ్ శక్తి, చింతా గ్రీన్ ఎనర్జీ, ఎవామర్ట్, అదానీ హైడ్రో ఎనర్జీ, ఎంపల్స్, ఏఎల్ డిక్సన్, గ్రిడ్-ఆన్ ఎనర్జీ, టాటా పవర్ సోలార్, పీయూఆర్ ఎనర్జీ, సెన్సోరమ్ ఫోటోనిక్స్, స్వర్ణగిరి గోల్డ్ మైన్, జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ, ఓర్వకల్లు డ్రోన్ సిటీ.. ఇలా లెక్కలేనన్ని దిగ్గజ ప్రాజెక్టులు రాష్ట్రానికి తరలివచ్చాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అమరరాజా కంపెనీని కక్షపూరితంగా వేధించి తెలంగాణకు తరిమేశారు. జాకీ పరిశ్రమను వెళ్లగొట్టారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ లాంటి గ్లోబల్ ఇన్వెస్టర్‌ను అవమానించి బయటకు పంపారు. కియా అనుబంధ సంస్థలను భయపెట్టారు. అక్రమాలు, దౌర్జన్యాలు భరించలేక లూలూ గ్రూప్ యజమాని 'జీవితంలో ఏపీ వైపు చూడను' అని చెప్పి వెళ్లిపోయిన పరిస్థితి తెచ్చారు. కానీ నేడు 'సీబీఎన్ ఈజ్ బ్యాక్' అన్న నినాదంతో అదే లూలూ గ్రూప్‌ను, కియా విస్తరణను, అంతర్జాతీయ పెట్టుబడిదారులను మళ్లీ రాష్ట్రానికి రప్పించి గౌరవప్రదంగా పరిశ్రమలు స్థాపించే వాతావరణాన్ని కల్పించాం. రాయలసీమలో రాయల్ ఎన్‌ఫీల్డ్, ఓర్వకల్లు డ్రోన్ సిటీలతో 'రైజింగ్ రాయలసీమ' సాధిస్తున్నాం. ఉత్తరాంధ్రలో డేటా సెంటర్లు, ఏవియేషన్ హబ్‌లతో కలలకు రెక్కలు తొడిగాం. కాకినాడను హైడ్రోజన్ ట్యాంక్స్ తయారీ

- (మిగతా వివరాలు 12లో)

‘స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర’తో మెరుగైన ఫలితాలు

- ఏపీ మున్సిపల్ మంత్రి నారాయణ
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి ఆరు జాతీయ అవార్డులు, ఢిల్లీలో స్వీకరించిన మంత్రి



న్యూఢిల్లీ (చైతన్యరథం): ఏపీలో సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న ‘స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర’ కార్యక్రమంతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ సత్తా చాటింది. ఈ ఏడాది రాష్ట్రానికి ఏకంగా ఆరు జాతీయ స్థాయి అవార్డులు దక్కాయి. గత ఏడాది 78 అవార్డుల్లో ఐదు అవార్డులు సాధించిన ఏపీ, ఈసారి మొత్తం 60 అవార్డుల్లో ఆరు అవార్డులు కైవసం చేసుకుంది. 2025-26 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ గెలుచుకున్న 6 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బుధవారం మంత్రి నారాయణ, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) కమిషనర్ ధ్యాన చంద్ర అందుకున్నారు. సూపర్ స్వచ్ఛ లీగ్ కేటగిరీలో విజయవాడ, గుంటూరు, తిరుపతి కార్పొరేషన్ లు అవార్డులు సాధించాయి. ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్ కేటగిరీలో రాజమండ్రి కార్పొరేషన్ అవార్డు సాధించగా... సఫాయి మిత్ర సురక్షిత్ షెహర్ కేటగిరీలో గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ అవార్డు గెలుచుకుంది. 20,000 కంటే తక్కువ జనాభా ఉన్న కేటగిరీలో స్వచ్ఛ సిటీగా కుప్పం మున్సిపాలిటీ అవార్డు కైవసం చేసుకుంది. నేషనల్ క్లీన్ సిటీ కేటగిరీలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ సాధించింది.

అవార్డులు అందుకున్న అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాష్ట్రం సాధించిన అవార్డుల శాతం పెరిగిందన్నారు. ఈ అవార్డులు వచ్చేందుకు ముఖ్య కారకులైన పారిశుద్ధ్య సిబ్బందికి, సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో రాష్ట్రానికి 6 జాతీయ స్థాయి అవార్డులు రావటం గర్వకారణమన్నారు. గత ఏడాది రాష్ట్రానికి ఐదు అవార్డులు వచ్చాయన్నారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, తిరుపతి, కుప్పం నగరాలకు ఈ అవార్డులు దక్కాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సత్ఫలితాలిస్తోందన్నారు. పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త తొలగింపు, వ్యర్థాల శుద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక గత వైసీపీ ప్రభుత్వం నుండి వారసత్వంగా వచ్చిన 153 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగించామని తెలిపారు. తొలి ఏడాదిలోనే 85 లక్షల టన్నుల చెత్తను తొలగించినట్లు వివరించారు. చెత్త ప్రాసెసింగ్ కోసం 106 ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వగా, ఇప్పటికే 60 ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయని, మరో 26 ప్లాంట్లను త్వరలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణాన్ని వచ్చే ఏడాదిన్నరలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని, గ్రీనరీ అభివృద్ధికి హెచ్ఏఎం ప్రాజెక్టు కింద రూ.900 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పట్టణాభివృద్ధికి రూ.50 వేల కోట్లతో వివిధ పనులు చేపడుతున్నామని, రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలను రాబోయే రెండేళ్లలో స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నారాయణ స్పష్టం చేశారు.

సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో..

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. మున్సిపాలిటీలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. చెత్త రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామన్నారు. పారిశుద్ధ్య కార్మికుల కృషితోనే ఈ విజయాలు వచ్చాయన్నారు. పారిశుద్ధ్యం ప్రజా ఉద్యమంగా మారాలన్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించామని, వచ్చే ఏడాది మరిన్ని అవార్డులు సాధిస్తామని పట్టాభి ధీమా వ్యక్తం చేశారు.

విద్యావ్యాప్తికి అబుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి

- కొనియాడిన టీడీపీ నేతలు
- జయంతి సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో నివాళులు



అమరావతి (చైతన్యరథం): స్వాతంత్ర భారత దేశపు మొదటి విద్యాశాఖ మంత్రి, బహుభాషా ప్రావీణ్యుడు, స్వాతంత్ర యోధుడు, హిందూ ముస్లిం ఐక్యత కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138 జయంతి సందర్భంగా బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయనకు పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశంలో విద్యావ్యాప్తికి ఆజాద్ ఎనలేని కృషిచేశారన్నారు. విద్యా శాఖమంత్రిగా ఉన్నప్పుడు పేదరికం పోయి దేశం అభివృద్ధి చెందాలంటే అందరికీ విద్యను అందుబాటులోకి తీసుకురావాలని ఆజాద్ భావించారన్నారు. అందుకు అనుగుణంగా ప్రైమరీ, సెకండరీ విద్యపై పూర్తిగా దృష్టి పెట్టి 14 సంవత్సరాల వయసు లోపల ఉన్న వారందరికీ విద్యాభ్యాసాన్ని తప్పనిసరి చేసి, ఆచరణలో పెట్టి దేశవ్యాప్తంగా సత్ఫలితాలు సాధించిన విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలన్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా యూజీసీ స్కీం పెట్టడమే కాకుండా ఐఐటీ విద్యని కూడా మొదటిసారి ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అన్నారు. దేశంలో ఉన్న ముస్లింలు – హిందువులు ఒకటిగా కలిసి జీవించాలని, పరమత సహనం తో భిన్న సాంప్రదాయాలను గౌరవించాలని, అందరు కలిసి ఒకటిగా ఉంటే దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా అభివృద్ధి చెందుతుందని కలలు కన్నా వ్యక్తి అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారులు ఎంఏ షరీఫ్, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు టీడీ జనార్ధన్ హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, ఉర్దూ అకాడమీ చైర్మన్ షబ్లీ, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ కోటేశ్వరరావు, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యుడు రమణ, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు లాల్ వజీర్, రాష్ట్ర మైనారిటీ జనరల్ సెక్రెటరీ పైజాన్, పతావుల్లా, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ నూర్, హుస్సేన్ మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ..
యువతకు ఉద్యోగాల కల్పనే మా ధ్యేయం

(11వ పేజీ తరువాయి)

మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మలిచి కోస్తాంధ్రను ప్రగతిపథంలో నడిపిస్తున్నాం. అటుఅమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా ముందుకు సాగుతుండగా, పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పరిశ్రమలకు, పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత సురక్షితమైన, సరైన గమ్యస్థానమని ప్రపంచం గుర్తించిందని, అందుకే వైజాగ్ సీఐఐ సమ్మిట్‌లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం సునాయాసంగా సాకారం కాబోతోందని ఎంపీ విజయ్ ధీమా వ్యక్తం చేశారు.

మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోందని, గతంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా నేరుగా గ్రౌండింగ్ చేసి డాక్యుమెంట్ రూపంలో ప్రజల ముందు ఉంచామని స్పష్టం చేశారు. గత సమ్మిట్‌లలో కుదుర్చుకున్న ఒప్పందాల్లో ఏకంగా రూ.11 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రస్తుతం గ్రౌండ్ అవుతున్నాయి. వీటి ద్వారా రాష్ట్రంలో సుమారు 15లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఏ ప్రాజెక్టు ఎక్కడ వస్తోంది, ఎన్ని ఉద్యోగాలు వస్తున్నాయనే వివరాలను పారదర్శకంగా పత్రాల ద్వారా ప్రజల ముందు పెట్టాం.ఇదే అసలైన బ్రాండ్ బాబు పాలన. ఒకవైపు విజన్ ఛాంపియన్ చంద్రబాబు నాయుడు, మరోవైపు ‘జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్’ నారా లోకేష్ నిరంతర శ్రమవల్లే ఇదంతాసాధ్యమైంది. వైకాపా ఐదేళ్ల పాలనలో నేరాలు, హత్యలు,గొడ్డలి రాజకీయాలవల్ల రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలనుకున్న సంస్థలను సైతం బెదిరించి, తరిమి కొట్టారు. ఆ దుష్పరిపాలన ఫలితాన్ని గుర్తించిన ప్రజలు, మొన్నటి 2024 ఎన్నికల్లోనే కాకుండా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమికి గత ఎన్నికల కంటే అధిక ఓటింగ్ శాతం కట్టబెట్టి చంద్రబాబుపై తిరుగులేని విశ్వాసాన్ని చాటారు. గురువారం నుంచి విశాఖపట్నంలో జరగబోయే సీఐఐ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ఎన్నో దిగ్గజ కంపెనీలు తరలి వస్తున్నాయి. మొత్తం రూ.26లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యంతో, దేశంలోనే రాష్ట్ర జీఎస్డీపీని రెండోస్థానానికి తీసుకెళ్లాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సింగిల్ డెస్క్ విధానం ద్వారా మంత్రి నారా లోకేష్ స్వయంగా పర్యవేక్షించి అన్నిఅనుమతులూ వేగంగా మంజూరు చేయిస్తున్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని ఎంపీ విజయ్ పిలుపునిచ్చారు.

గుంటూరు మేయర్, కార్పొరేటర్లకు సన్మానం

గుంటూరు (చైతన్యరథం): గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందిన మేయర్, పలువురు కార్పొరేటర్లను టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్ర సత్కరించారు. గుంటూరులోని నరేంద్ర నివాసంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్లు కొండలు (68 వ డివిజన్), ముప్పవరపు భారతి (69 వ డివిజన్), అల్లాడి జెస్సి కృప సౌజన్య (70 డివిజన్), దయా రత్నం (71 వ డివిజన్), ఆనంద్ (72వ డివిజన్), సమత (67వ డివిజన్– జనసేన), నూకవరపు బాలాజీ (62వ డివిజన్) తదితరులను నరేంద్ర ఘనంగా సన్మానించారు.



జోన్ - 1
(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)
చైతన్యరథం

సర్పంచ్ ఎన్నికల్లోను విజయపరంపర కొనసాగించాలి

● టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన హోంమంత్రి వంగలపూడి అనిత



అనకాపల్లి (చైతన్యరథం): రెండు వారాల్లో జరగనున్న సర్పంచి ఎన్నికల్లోను విజయపరంపరను కూటమి మద్దతుదారులు కొనసాగించాలని హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. ప్రాదేశిక ఎన్నికల్లో విజయం సాధించిన పాయకరావుపేట నియోజకవర్గ ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులను నక్కపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా సత్కరించారు. అనంతరం వీరందరికి దగ్గరుండి భోజనం వడ్డించి వారితో పాటు కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కోటవట్ల మండలాన్ని కైవసం తీసుకోవడం ప్రజా మద్దతుకు అద్దం పడుతుందన్నారు. 4 మండలాల్లో మండల పరిషత్ స్థానాలను అదేవిధంగా జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. జిల్లాలో సైతం కూటమి తన హవా చూపిందని 24 మండలాల్లో అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను గెలుపొందామని పేర్కొన్నారు. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి ముఖ్య నాయకులంతా పాల్గొన్నారు.

విశాఖ ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



విశాఖపట్నం (చైతన్యరథం): భారత తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, 'భారతరత్న' మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విశాఖపట్నంలోని ఎన్టీఆర్ భవన్ పార్టీ కార్యాలయంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ విద్యా రంగానికి, స్వాతంత్ర్య పోరాటానికి ఆజాద్ చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ మాట్లాడుతూ... భారతదేశ చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజు. ఈ రోజును మనం జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. భారతదేశ తొలివిద్యాశాఖ మంత్రి, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త, మేధావి అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1947 నుంచి 1958 వరకు భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశంలో విద్యా రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలనే గొప్ప లక్ష్యంతో ఆయన కృషి చేశారని, హిందూ-ముస్లిం ఐక్యత, మతసామరస్యం, జాతీయ సమైక్యత కోసం ఆయన ఎంతో కృషి చేశారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ విద్య అందాలని ఆకాంక్షించారని అన్నారు.

సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలను పెంపొందించాలి



కురుపాం (చైతన్యరథం): అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు చిన్నప్పటి నుంచే అలవాట్లు, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలు పెంపొందించేలా బోధన చేయాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ అన్నారు. బుధవారం కురుపాం ప్రాజెక్టు పరిధిలోని 160 మంది అంగన్వాడీ కార్యకర్తలకు 'పోషణ్ భీ పఢాయీ భీ' శిక్షణ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో 3-6 ఏళ్లలోపు చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని, నవచేతన, మూడేళ్లలోపు చిన్నారుల పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అనంతరం చట్టబద్ధమైన పిల్లల దత్తతపై అవగాహన కల్పించి, అక్రమ దత్తత, పిల్లల విక్రయాలు, బాలల అక్రమ రవాణా వంటి ఘటనలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విశాఖపట్నం (చైతన్యరథం): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నం చేరుకున్న సందర్భంగా విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, నూతన పరిశ్రమలు, యువతకు విస్తృత ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్చలు జరగనున్నాయి. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ఈ సదస్సు వేదిక కానుంది.

కార్యకర్త నుంచి కార్పొరేటర్ వరకు.. కష్టానికి దక్కిన గుర్తింపు!

●పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతలోనూ ముందంజ.. ప్రజాక్షేత్రంలో అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు

●మై టీడీపీ యాప్ ప్రచారంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

●4,359 మంది కార్యకర్తలతో యాప్ అనుసంధానం.. 2,800 పార్టీ సభ్యత్వాలు నమోదు

విజయవాడ (చైతన్యరథం): సామాన్య కార్యకర్తగా తెలుగుదేశం పార్టీలో ప్రస్థానం ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదుగుతూ కార్పొరేటర్ స్థాయికి చేరుకోవడం తన రాజకీయ జీవితంలో ఎంతో సంతృప్తినిచ్చిందని విజయవాడ తూర్పు నియోజకవర్గం 18వ డివిజన్ కార్పొరేటర్ పేర్కొన్నారు. పార్టీ పట్ల నిబద్ధత, నిరంతర కృషి, అధినేతల ఆశీస్సులతోనే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పాత 12వ డివిజన్, ప్రస్తుత 18వ డివిజన్‌లో సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం బూత్ కన్వీనర్, డివిజన్ యూత్ ప్రెసిడెంట్, క్లస్టర్ ఇన్‌చార్జి, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ కమిటీ సభ్యుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. పార్టీ అప్పగించిన ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ నాయకత్వం నమ్మకాన్ని పొందారు.

మై టీడీపీ యాప్ ప్రచారంలో రాష్ట్రస్థాయి గుర్తింపు

టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రవేశపెట్టిన మై టీడీపీ యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేశారు. ఈ ప్రచారంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ కార్యకర్త అవార్డును అందుకున్నారు. ఇప్పటివరకు 4,359 మంది కార్యకర్తలతో మై టీడీపీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించినట్లు వెల్లడించారు.

సభ్యత్వ నమోదులోనూ ప్రత్యేక చొరవ

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేసిన సమయంలో 'బాదుడే బాదుడు', 'సూపర్ సిక్స్' కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందున్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ ఆశీస్సులతో 2024-2026 మధ్య రామలింగేశ్వరనగర్ ప్రాంతంలో 2,800 పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించారు. ఇందులో తన రిఫరల్ ద్వారా 1,000



సభ్యత్వాలు చేయించినట్లు వివరించారు.

కార్యకర్తే అధినేత.. ఆచరణలో చూపిన ప్రస్థానం

పార్టీలో సామాన్య కార్యకర్తకు లభించే గుర్తింపు, ప్రోత్సాహానికి తన రాజకీయ ప్రయాణమే నిదర్శనమని పేర్కొన్నారు. పదవుల కంటే పార్టీ కోసం చేసిన కృషి, కార్యకర్తలతో ఉన్న అనుబంధమే తన ఎదుగుదలకు పునాది అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన అవకాశాలు, నాయకుల ఆశీస్సులు, కార్యకర్తల సహకారంతోనే కార్పొరేటర్‌గా ఎన్నికయ్యానని పేర్కొంటూ పార్టీకి, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలి : టీడీపీ నేత


ఆమదాలవలస (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఆముదలవలస పట్టణంలో లక్ష్మీనారాయణ దేవాలయం ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ సమష్టిగా ఎన్నికల కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.



బంగాళాఖాతంలో మరో వాయుగుండం... ఏపీకి వర్ష గండం

అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలో మరోసారి అల్పపీడనం రూపుదిద్దుకుంటోంది. దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో నవంబర్ 13నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనం వాయువ్య దిశగా పయనిస్తూ తర్వాతి 24 గంటల్లో మరింత బలపడి సుస్పష్టమైన అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత ఆదివారం నాటికి అదే ప్రాంతంలో వాయుగుండంగా బలపడే అవకాశముందని అంచనా. శనివారం నుంచి మంగళవారం వరకు సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉండటంతో మత్స్యకారులు ఆగ్నేయ, నైరుతి, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ప్రస్తుతానికి ఆంధ్రప్రదేశ్‌పై ఈ వ్యవస్థ ప్రభావం లేదు. రాబోయే మూడు రోజుల్లో కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమలో పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. భూమి నుంచి సముద్రం వైపు పొడి గాలులు వీస్తున్నందున ఈ వ్యవస్థ తీరం దాటకముందే కొంత బలహీనపడవచ్చు. అయినప్పటికీ ఇది తుఫాను స్థాయికి చేరుకోకపోయినా తీవ్ర వాయుగుండంగా లేదా వాయుగుండంగా తీరం దాటే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో దక్షిణ కోస్తాంధ్ర లేదా ఉత్తర తమిళనాడు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా.

ముఖ్యంగా ఒంగోలు, చెన్నై, పుదుచ్చేరి ప్రాంతాల మధ్య తీరం దాటవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కొన్ని అంచనాలు సూచిస్తున్నాయి. తెలంగాణలో



మాత్రం రాత్రులు చలి తీవ్రత పెరుగుతోంది. పగటిపూట ఎండలు కొనసాగుతాయి. రాబోయే వారం రోజుల పాటు వర్ష సూచన లేదు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని వాతావరణ శాఖ కోరింది. సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులు తాజా అప్‌డేట్‌లను తప్పనిసరిగా తెలుసుకోవాలని వాతావరణ శాఖ పేర్కొంది. వాతావరణ పరిస్థితులు మారుతున్నందున రోజువారీ సూచనలు పరిశీలించాలని సూచించారు.

దట్టంగా పొగమంచు... పర్యాటకుల కారుకు ప్రమాదం... ఇద్దరికీ తీవ్ర గాయాలు



గూడెం కొత్తవీధి (చైతన్యరథం): అల్లూరి జిల్లా గూడెం కొత్తవీధి నుంచి సీలేరు వెళ్లే మార్గంలో కొత్తపల్లి మలుపు వద్ద నలుగురు పర్యాటకులతో వెళుతున్న ఒక కారు బుధవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైంది. దట్టంగా అలుముకున్న పొగ మంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పి సమీప లోయలోకి పడిపోయింది. కారులో నలుగురు వ్యక్తులు ఉండగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు గుర్తించి గూడెం కొత్త వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 వాహనంలో తరలించారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

కోర్టు కేసులు క్లియర్... ఆ 23 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ ఖరారు



అమరావతి (చైతన్యరథం): ఏపీలో వరసగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఫలితాల్లో కూటమి పార్టీలు విజయకేతనం ఎగురవేశారు. కోర్టు వివాదాల వల్ల కొన్ని మున్సిపల్, కార్పొరేషన్‌లకు ఎన్నికలు జరగలేదు. ఇప్పుడు ఆ వివాదాలు తొలగిపోవడంతో రాష్ట్రంలోని మొత్తం 23 మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలకు ఈ 26వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు SEC రంగం సిద్ధం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల జాతర కొనసాగుతుంది. ఇప్పటికే కార్పొరేషన్, మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలు కూడా వచ్చేశాయ్. త్వరలో పంచాయతీ, సహకార సంఘ ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈలోపు పెండింగ్‌లో ఉన్న పురపాలక సంఘాలతో పాటు వివిధ నగరపాలక సంస్థలకు పోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నిర్ణయించింది. కోర్టు వివాదాలు, న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో రాష్ట్రంలోని మొత్తం 23 మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలకు ఈ 26వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిశ్చయించింది. నవంబర్ 26వ తేదీనే ఈ పట్టణ స్థానిక సంస్థలకు కూడా ఎన్నికలు జరపాలని ప్రాథమికంగా నిర్ణయించడం జరిగింది. ఈ మేరకు ఈ నెల 13వ తేదీన అధికారిక ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. ఎన్ని మున్సిపాలిటీలు ఎన్నికలంటే?

ఈ ఎన్నికల కోసం SEC కసరత్తు ప్రారంభించింది. ఈనెల 26వ తేదీన శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రిలతో పాటు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థలు, వీటితో పాటు ఆముదాలవలస, రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, గుడివాడ, తాడిగడప, పొన్నూరు, నర్సరావుపేట మున్సిపాలిటీలలోనూ పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈ ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అన్ని రకాల ప్రాథమిక ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేసినట్టు తెలుస్తుంది. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 13 నగర పాలక సంస్థలు, 92 మున్సిపాలిటీలకు ఎన్నికలను నిర్వహించడం జరిగింది.

మౌలానా అబుల్ కలాం జీవితం ఆదర్శం : ఎమ్మెల్యే నసీర్

● తూర్పు కార్యాలయంలో ఘన నివాళులర్పించిన మైనారిటీ నాయకులు



గుంటూరు (చైతన్యరథం): స్వాతంత్ర్య సమరయోధుడు, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మైనారిటీ నాయకులు అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వతంత్ర భారతదేశంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశంలో ఐఐటీ, యూజీసీ వంటి అత్యున్నత విద్యాసంస్థల స్థాపనకు ఆనాడే పునాదులు వేసిన గొప్ప దూరదృష్టి కలిగిన నాయకుడు ఆజాద్ అని గుర్తు చేశారు. 14 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను అందించడంతో పాటు, స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి ఆజాద్ ఎంతో కృషి చేశారని చెప్పారు. 'అల్-హిలాల్' పత్రిక ద్వారా స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిస్తూనే, లౌకికత్వానికి, మత సామరస్యానికి ఆయన ప్రతీకగా నిలిచారని తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ అధ్వర్యంలో నియోజకవర్గంలో మైనారిటీల సంక్షేమానికి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కట్టుబడి పని చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనారిటీ విభాగం నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

13వ డివిజన్ అభివృద్ధికి రూ.5.20 కోట్ల నిధులు ఖర్చు చేశాం

●కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమికి ప్రజలు మరింత బలమైన విజయాన్ని అందించాలి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాబోయే రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాత 13వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కప్పల వెలుగుకుమారి, స్థానిక నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, చెల్లుబోయిన నాగమణి, నగరబోయిన రామకృష్ణ, బొర్రా చిన్ని, రాయి అప్పన్నబాబు తదితరులతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 41వ డివిజన్ (పాత 13వ డివిజన్)లో ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులు, ప్రారంభం కావాల్సినవి, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు కలిపి మొత్తం రూ.5.20 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో రాజమహేంద్రవరం నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా నగరవాసులు ఎదురుచూస్తున్న మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం నుంచి గోదావరి తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే రివర్ ఫ్రంట్, అఖండ గోదావరి వంటి ప్రాజెక్టుల వరకు అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, తాజాగా నగరానికి మరో 5 వేల కొత్త పెన్షన్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందజేస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇతర అవసరాలను కూడా గుర్తించి, ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. నగరంలోని 42 డివిజన్లలోనూ కూటమికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు కూటమి పాలనను కోరుకుంటున్నారని అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు మరింత బలమైన తీర్పు ఇచ్చి కూటమిని భారీ మెజారిటీతో గెలిపిస్తే, రెట్టింపు ఉత్సాహంతో నగర అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ.. ఈవీఎంలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ బ్యాలెట్ విధానాన్ని కోరిన వారు, బ్యాలెట్‌లోనూ ఓటమి ఎదురైన తర్వాత మళ్లీ ఈవీఎంలపై మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈవీఎంలైనా, బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగానే ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనం కొనసాగుతోందని అన్నారు. ఎప్పటి నుంచో తమను ఆదరిస్తూ విజయాలు అందిస్తున్న రాజమహేంద్రవరం ప్రజలు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ అదే ఆదరణతో కూటమి అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

కాకినాడ జీజీహెచ్ ఆధునికీకరణపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన హైట్స్ సంస్థ ప్రతినిధులు

●రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు ప్రత్యేక శ్రద్ధతో ఊపందుకున్న కాకినాడ జీజీహెచ్ అభివృద్ధికి కార్యాచరణ



కాకినాడ (చైతన్యరథం): గోదావరి జిల్లాల ప్రజలకు మెరుగైన, అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని 3వేల పడకల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభమైంది. రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని HLL Infra Tech Services Limited (HITES) సంస్థ ప్రతినిధులు బుధవారం కాకినాడ జీజీహెచ్‌ను, కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ (RMC)లను సందర్శించారు. ఈ సందర్భంగా RMC, GGH పరిధిలోని అన్ని భవనాలతో పాటు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను HITES ప్రతినిధులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతిపాదిత అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్, డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) రూపకల్పన కోసం ప్రస్తుత భవనాల పరిస్థితి, మౌలిక వసతులు, వైద్య విభాగాలు, రోగులకు అందుతున్న సేవలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన విస్తరణ పనులు, స్థల లభ్యత తదితర అంశాలను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరించారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదిత అంచనా వ్యయం సుమారు రూ.766 కోట్లుగా ఉంది. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా మాస్టర్ ప్లాన్, డీపీఆర్ రూపకల్పనకు తదుపరి కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ ప్రతిపాదనకు సంబంధించిన తదుపరి సాంకేతిక అధ్యయనం, కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు అవసరమైన వివరాల సేకరణకు మార్గం సుగమమైందని HITES సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖతో, HITES సంస్థతో, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రతిపాదనను తదుపరి దశలకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు పేర్కొన్నారు. HITES ప్రతినిధి మహమ్మద్ ఆరిఫ్ బాషా, HITES కన్సల్టెంట్స్ ప్రతినిధి ఎస్.పీ. జవహర్ లకు రంగరాయ మెడికల్ కాలేజీ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.దుర్గారాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్య కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చి. రత్నరాజు, ఆర్ఎంసీ, జీజీహెచ్ డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ ఎన్. శ్రీధర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ ఈ పర్యటనలో HITES బృందానికి అవసరమైన వివరాలను అందించారు.

ఏలూరులో అభివృద్ధి కార్యక్రమాల పరంపర జోరు

● సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు (చైతన్యరథం): గడిచిన రెండేళ్ళలో ఒక్క ఏలూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కూటమి ప్రభుత్వ సువర్ణపాలనకు నిదర్శనమంటూ ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి చంటి వ్యాఖ్యానించారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల పరంపర నిరాటంకంగా కొనసాగుతూనే ఉందని ఇదేక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 53వ డివిజన్ నందు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డును అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ పనులను ఆయన పరిశీలించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఒకపక్క రహదారుల నిర్మాణం, మరోపక్క మౌళిక వసతుల కల్పన, ఇంకోపక్క సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. ఈ కార్యక్రమంలో EUDA చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కార్పొరేటర్లు అమరావతి అశోక్, పెద్దాడ వెంకట రమణ, నాయకులు గూడవల్లి శ్రీనివాస్, త్రిపర్ణ రాజేష్, ఆర్నేపల్లి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో నవజాతి శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా వైద్యులకు ప్రత్యేక శిక్షణ

అమరావతి (చైతన్యరథం): నవజాత శిశువుల సంరక్షణపై ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. శిశువుల ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన 'ఎఫ్‌బీఎన్‌సీ' (ఫెసిలిటీ బేస్డ్ న్యూబోర్న్ కేర్) పోర్టల్ వినియోగాన్ని బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు పోర్టల్ వినియోగంపై వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణను కల్పిస్తూ మంగళగిరిలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కాగా.. జాతీయ ఆరోగ్య మిషన్ కింద నిర్వహించే ఈ పోర్టల్‌ను.. నవజాత శిశువుల మరణాల సంఖ్యను తగ్గించేందుకు, వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు రూపొందించారు. నవజాత శిశువుల ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన 'ఎఫ్‌బీఎన్‌సీ' పోర్టల్ వినియోగాన్ని బలోపేతం చేసేందుకు ఏపీ వైద్యశాఖ చర్యలు చేపట్టింది.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

మౌలానా అబుల్ కలాం అజాద్ 138వ జయంతి

● నివాళులర్పించిన గుంటూరు మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ



గుంటూరు (చైతన్యరథం): భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, తన క్యాంపు కార్యాలయంలో జిల్లా మైనారిటీ నాయకులు షేక్ రుస్తుంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు అపర్ణని ఆత్మీయంగా సన్మానించి, ప్రత్యేక దువా ద్వారా శుభాశీస్సులు అందజేశారు. దేశ విద్యారంగ అభ్యున్నతికి పునాదులు వేసి, విద్యావ్యాప్తి, ఉన్నత విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన ఆజాద్ సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్ వలి, షేక్ మీరావలి, షేక్ మదర్ వలి, షేక్ జాఫర్, షేక్ బాజీ, షేక్ ఖాదర్, షేక్ రఫీ, ముస్లిం మత పెద్దలు, విద్యార్థులు పాల్గొని ఆ మహనీయునికి నివాళులర్పించారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



తిరుమల / వినుకొండ (చైతన్యరథం): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు వినుకొండ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధికి పటిష్టమైన కార్యాచరణ

●యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: చైర్మన్ డేగల ప్రభాకర్



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అధ్యక్షతన నేడు కార్పొరేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటూరు నుంచి చైర్మన్ డేగల ప్రభాకర్ వర్చువల్ (ఆన్లైన్) ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్పొరేషన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సమీక్షించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్పొరేషన్ అభివృద్ధి, కార్యకలాపాల వేగవంతం, పరిపాలనా సామర్థ్యం పెంపొందించే దిశగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా "వన్ ఫ్యామిలీ – వన్ ఎంట్రప్రెన్యూర్" అనే లక్ష్యంతో కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించి, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సొంతంగా పరిశ్రమలు స్థాపించేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. నూతన పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించి, ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆటోలో అగ్ని ప్రమాదం... ప్రాణాలు దక్కించుకున్న డ్రైవర్

తుళ్లూరు (చైతన్యరథం): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఐనవోలులో ఓ ఆటోలో అగ్నిప్రమాదం జరిగింది. విజయవాడ నుంచి విట్ యూనివర్సిటీ వైపు వెళ్తుండగా ఆటోలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే ఆటోను ఆపి దూరంగా వెళ్లడంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. మంటల తీవ్రతకు ఆటో పూర్తిగా దగ్ధమైంది.

పదవులు అలంకారప్రాయాలు కాదు.. ప్రజలకు సేవ చేసేందుకు లభించిన బాధ్యతలు

●నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులతో ఎంపీ కేశినేని శివనాథ్ భేటీ



విజయవాడ (చైతన్యరథం): ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే పదవుల సంబరాలు, రాజకీయ హడావుడికే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రత్యేకత అని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలోకి తీసుకువచ్చే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆయన సూచించారు. బుధవారం ఎంపీ కార్యాలయ వేదికగా ఈ భేటీ జరిగింది.

నూతన ప్రజాప్రతినిధులతో ఎంపీ కేశినేని చిన్ని మర్యాదపూర్వక భేటీ

నందిగామ నియోజకవర్గంలోని చందర్లపాడు మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్నిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ భేటీలో కేవలం ఎన్నికల విజయానికి సంబంధించిన అభినందనలు, శుభాకాంక్షలకే పరిమితం కాకుండా చందర్లపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజాప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత కావాలి

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని ఒక బాధ్యతగా స్వీకరించాలని, ప్రజలు మనకు అప్పగించిన పదవులు వ్యక్తిగత హోదా, ప్రతిష్ఠ కోసం కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు లభించిన అవకాశాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే పదవుల సంబరాలు చేసుకోవడం కంటే, ప్రజలు మనపై పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలను గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఎంతో ముఖ్యమన్నారు. నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు నుంచే ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

చందర్లపాడు మండల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పదవులు చేపట్టిన వెంటనే తమ మండలంలోని సమస్యలను గుర్తించి, వాటిని తన దృష్టికి తీసుకురావడం అభినందనీయమని ఎంపీ చిన్ని అన్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రజాప్రతినిధులకు ఉన్న బాధ్యత, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని గ్రామాల అభివృద్ధికి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీ కేశినేని చిన్ని ఆకాంక్షించారు. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై, వారి అవసరాలను తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, చందర్లపాడు మండల సమగ్ర అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

నిర్మాణ పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి



తాడికొండ (చైతన్యరథం): మార్పు పథకంలో చేపట్టిన ప్రభుత్వ వసతి గృహాల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీఎం సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. తాడికొండలోని డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల వసతి గృహం, ఎస్వీవీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న వివిధ పనులు పురోగతిని పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, పనుల్లో ఎలాంటి జాప్యం జరిగినా సహించేది లేదన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి మయూరి, తహసీల్దార్ సీతారామయ్య, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

అతి త్వరలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహ ఏర్పాటు : గళ్ళా మాధవి

●అత్యున్నత విద్యా విధానంతో ముందుకు సాగుతున్న భారతదేశానికి మొట్టమొదటి అడుగు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్



గుంటూరు (చైతన్యరథం): అత్యున్నతన విద్యా విధానంతో ముందుకు సాగుతున్న భారతదేశానికి మొట్టమొదటి అడుగు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని, అటువంటి మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని అతి త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. బుధవారం స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 139వ జయంతి వేడుకలు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం (శ్రీనివాసరావుపేట)లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ఎన్డీయే కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... దేశానికి ఆదర్శప్రాయమైన పరిపాలన అందించిన ఎందరో మహనీయుల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అగ్రగణ్యులని, మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా ఆయన దేశానికి అందించిన సేవలు ఎప్పటికీ మరవలేనివని కొనియాడారు. నేడు ఆధునిక విద్యా విధానంతో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న భారతదేశానికి మొట్టమొదటి పునాది రాయి, బలమైన అడుగు ఆయన ఆలోచనలతోనే పడిందని, రానున్న నాయకులు, భావితరాల ప్రజలు ఆయన జీవిత చరిత్రను, ఆదర్శాలను తప్పక తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. ఈ స్ఫూర్తిని ముందుతరాలకు అందించేందుకు రానున్న రోజుల్లో విద్యార్థులకు వ్యాసరచన, సంగీత పోటీలు నిర్వహిస్తామని, అలాగే నియోజకవర్గ మైనారిటీ నేతలు, కార్యకర్తల ఆకాంక్ష మేరకు స్థానిక షాదీఖానా వద్ద మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆయన పేరు మీద ఒక ఆర్చ్‌ను కూడా నిర్మిస్తామని, ఈ ఏడాది కాలంలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

ఫ్రెండ్‌తోనే పురుగుల మందు తాగించిన తోటి విద్యార్థులు

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరులోని ఓ పాఠశాలలో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. సంగం గ్రామంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు, నీరసంతో ఇబ్బంది పడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ అక్కడ పరిస్థితి మరింత క్షీణించింది. మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. అయితే స్కూల్లో తోటి విద్యార్థులు తనతో పురుగుల మందు తాగించారని ఆ విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతుంది. పాఠశాలల్లో పాఠాలు బోధించాలి.. పిల్లలు చదువుకోవాలి.. కానీ దీనికి భిన్నంగా జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో క్లాస్‌రూమ్‌లు క్రైమ్ సీన్‌లుగా మారిపోతున్నాయి. దాంతో తమ పిల్లలు స్కూల్ నుంచి క్షేమంగా వస్తారా? లేదా? అనే టెన్షన్ తల్లిదండ్రుల్లో నెలకొంది. తాజాగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కూడా ఓ పాఠశాలలో కూడా దారుణం చోటుచేసుకుంది. స్కూల్లో తోటి విద్యార్థులు చేసిన పనికి ఓ బాలుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. స్నేహంగా ఉండాల్సిన.. విద్యార్థితో సహచరులే బలవంతంగా పురుగుల మందు తాగించారు. ఈ అత్యంత దారుణమైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. నెల్లూరు జిల్లా సంగం గ్రామంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఓ బాలుడు పదో తరగతి చదువుతున్నాడు. అక్టోబర్ నెలాఖరులో రోజువారీ లాగానే స్కూల్‌కు వెళ్లిన ఆ విద్యార్థి... సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కొద్దిసేపటికే వాంతులు చేసుకున్నాడు. బాగా నీరసించిపోయాడు. దాంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ బాలుడి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో మెరుగైన వైద్యం అందించాల్సి ఉందని డాక్టర్లు వారికి సూచించారు.

పొదలకూరు రాజకీయాల్లో కీలక పరిణామం



సర్వేపల్లి (చైతన్యరథం): పొదలకూరు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుందని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న కాకాణికి గుడ్ బై చెప్పేసి తెలుగుదేశం పార్టీలో చేరడం శుభపరిణామమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వెలిమిరెడ్డి సుబ్బారెడ్డి, నరసింహారెడ్డితో పాటు టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలందరికీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆత్మీయ ఆహ్వానం పలికారు. పొదలకూరు మండల సమగ్ర అభివృద్ధి సోమిరెడ్డితోనే సాధ్యమని, కాబట్టే సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించిన కలిచేటి ప్రభాకర్ రెడ్డితో పాటు ఎంపీటీసీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, సమన్వయంతో కష్టపడి పనిచేసిన నాయకులందరినీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నేత నాగార్జున యాదవ్‌కు టీడీపీ నేత సర్నాల బాలాజీ సవాల్



గన్నవరం (చైతన్యరథం): ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావుపై వైసీపీ నాయకుడు నాగార్జున యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నియోజకవర్గ టీడీపీ బీసీ నాయకుడు సర్నాల బాలాజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదంపాడులో తన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ విమర్శలు రాజకీయాల వరకే పరిమితం కావాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని హితవు పలికారు. గన్నవరం అభివృద్ధి గురించి మాట్లాడే ముందు గత పదేళ్ల వైసిపి పాలనలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని నాగార్జున యాదవ్‌ను ప్రశ్నించారు. ప్రసాదంపాడు గ్రామంలో గతంలో గుంతలమయంగా ఉన్న రహదారిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయించారని తెలిపారు. వేలాది మంది ప్రయాణించే ఆ రహదారిని అభివృద్ధి చేసినందుకు కృతజ్ఞతగా గ్రామ నాయకులంతా కలిసి సొంత ఖర్చులతో ఆర్చి నిర్మించి, గ్రామపంచాయతీ తీర్మానంతో 'యార్లగడ్డ వెంకట్రావు మార్గ్'గా పేరు పెట్టుకున్నామని వివరించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి చేసిన నాయకుడికి కృతజ్ఞతగా పేరు పెట్టుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. బీసీలు, ఎస్సీలకు ఎమ్మెల్యే దూరంగా ఉంటున్నారంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. "నేను బీసీని కాదా? నా పేరు సర్నాల బాలాజీ. నేను యాదవుడిని కాదా? బీసీలకు ఎమ్మెల్యే దూరమని ఏ ఆధారంతో మాట్లాడుతున్నారు?" అని నిలదీశారు. కాలనీలకు నాయకుల పేర్లు పెట్టడంపై విమర్శలు చేస్తున్న నాగార్జున యాదవ్ ముందుగా వైసిపి హయాంలో పెట్టిన జగనన్న కాలనీలు, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మఒడి వంటి పేర్లపై సమాధానం చెప్పాలని అన్నారు.

అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి : ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్



నెల్లూరు (చైతన్యరథం): డబ్బు, ఆస్తులు శాశ్వతం కాకపోవచ్చని, కానీ విద్యతో సంపాదించిన జ్ఞానాన్ని ఎవరూ దూరం చేయలేరని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి సందర్భంగా బుధవారం నెల్లూరులోని ఆజాద్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం, జాతీయ సమైక్యత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆజాద్ అని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగానికి బలమైన పునాదులు వేశారని, ఆయన సేవలకు గుర్తింపుగా జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. దేశ విభజనను వ్యతిరేకించి, అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి ఉండటమే దేశానికి బలమని చాటిచెప్పిన ఆజాద్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల కుటుంబాలు పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తాత్కాలిక ఆదాయం కోసం చిన్న వయసులోనే చదువు మాన్పించి పనులకు పంపవద్దన్నారు. ప్రతి బిడ్డలో ప్రతిభ ఉంటుందని, సరైన ప్రోత్సాహం అందిస్తే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, ఇంజనీర్లుగా, శాస్త్రవేత్తలుగా ఎదిగి కుటుంబానికి, దేశానికి సేవ చేయగలరని పేర్కొన్నారు.

చట్టపరంగా అవసరం లేని చోట తండ్రి పేరు తప్పనిసరి నింబధనను తొలగించాలి : రాయపాటి శైలజ



అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ శాఖల దరఖాస్తులు, అధికారిక రికార్డులు, ధ్రువీకరణ పత్రాల్లో చట్టపరంగా తప్పనిసరి కాని సందర్భాల్లో తండ్రి పేరు నమోదు చేయాలనే నిబంధనను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ సూచించారు. తండ్రి పేరు లేదనే కారణంతో ఏ చిన్నారికీ విద్య, గుర్తింపు పత్రాలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవలు దూరం కాకూడదని చెప్పారు. విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్‌లో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంయుక్తంగా "ప్రభుత్వ దరఖాస్తులు, అధికారిక రికార్డుల్లో తండ్రి పేరు తప్పనిసరి నిబంధనను తొలగించడం – బాలల హక్కుల దృక్పథం" అనే అంశంపై రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశంలో పాల్గొన్న రాయపాటి శైలజ మాట్లాడుతూ... కుటుంబ పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి చిన్నారికి సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ దరఖాస్తుల్లో తండ్రి పేరు తప్పనిసరి చేయడం వల్ల ఒంటరి తల్లులు, అవివాహిత మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, చట్టబద్ధ సంరక్షకుల వద్ద పెరుగుతున్న పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తండ్రి వివరాలు లేవనే కారణంతో పిల్లల విద్య, భవిష్యత్తుకు ఆటంకం కలగకూడదని, చట్టపరంగా అవసరం లేని చోట తల్లి లేదా చట్టబద్ధ సంరక్షకుల పేరును ప్రత్యామ్నాయంగా అనుమతించాలని సూచించారు.

తండ్రి పేరు లేదనే కారణంతో ఎలాంటి సేవలను నిరాకరించకూడదు

ఈ అంశంపై సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమన్వయంతో పనిచేయాలని కోరారు. అన్ని శాఖల్లో ఒకే తరహా విధానాన్ని అమలు చేసేందుకు సమగ్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ దరఖాస్తులు, ఆన్‌లైన్ పోర్టల్స్‌లో అవసరమైన మార్పులు చేపట్టి, క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. పిల్లల కుటుంబ పరిస్థితుల గురించి పదేపదే ప్రశ్నించడం వల్ల వారిలో మానసిక ఆందోళన, అవమాన భావన కలగకుండా చూడాలని, వారి వ్యక్తిగత గోప్యత, గౌరవాన్ని కాపాడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ... ప్రతి చిన్నారికి స్వతంత్ర హక్కులు, గౌరవం, గుర్తింపు ఉంటాయని, తల్లిదండ్రుల వైవాహిక స్థితి, కుటుంబ పరిస్థితులు, సామాజిక నేపథ్యం ఆధారంగా పిల్లల భవిష్యత్తు నిర్ణయించరాదని పేర్కొన్నారు. పిల్లల గౌరవం, సమానత్వం, వ్యక్తిగత గుర్తింపు, ప్రాథమిక హక్కులకు ప్రభుత్వ పరిపాలనా విధానాల్లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తండ్రి పేరు తప్పనిసరి కాని చోట ఆ నిబంధనను తొలగించి తల్లి లేదా చట్టబద్ధ సంరక్షకుల వివరాలను అనుమతించాలని సూచించారు. పాఠశాల ప్రవేశాలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలు, గుర్తింపు పత్రాల జారీలో తండ్రి పేరు లేదనే కారణంతో ఎలాంటి సేవలను నిరాకరించకూడదన్నారు.

బాలల సంక్షేమానికి ప్రాధాన్యత

ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల కన్వెన్షన్‌లోని ఆర్టికల్స్ 2, 3, 7, 8, 12, 16, 28లను ప్రస్తావిస్తూ... వివక్షకు తావులేకుండా చూడటం, బాలల సంక్షేమానికి ప్రాధాన్యత, గుర్తింపు హక్కు, అభిప్రాయ వ్యక్తీకరణ, వ్యక్తిగత గోప్యత, విద్యా హక్కులను ఈ నిబంధనలు పరిరక్షిస్తున్నాయన్నారు. ఒంటరి తల్లులు, అవివాహిత మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ బాధితులు, చట్టబద్ధ సంరక్షకుల వద్ద పెరుగుతున్న పిల్లలు ప్రభుత్వ దరఖాస్తుల్లో తండ్రి పేరు తప్పనిసరిగా నమోదు చేయాలనే నిబంధన కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

గుంటూరు జిల్లా నుంచి పంచారామాలు... త్రిశైవక్షేత్రాలకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు



గుంటూరు (చైతన్యరథం): కార్తీక మాసం సందర్భంగా ఏపీలోని పంచారామాలకు, త్రిశైవక్షేత్రాలకు భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ జిల్లా నుంచీ పంచారామాలకు, త్రిశైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్ని ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా గుంటూరు జిల్లాలోని గుంటూరు, తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోల నుంచి పంచారామాలకు, త్రిశైవక్షేత్రాలకు రాకపోకలు సాగించేలా ప్రత్యేక బస్సుల్ని అధికారులు ప్రకటించారు. పంచారామాలతో పాటు త్రిశైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. జిల్లాలోని గుంటూరు 1, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల నుంచి ఈ బస్సులు ప్రతీ శనివారం రాత్రి 9.30 గంటలకు, ఆదివారం రాత్రి 9.35 గంటలకు బయలుదేరుతాయని తెలిపారు. పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటతో పాటు త్రిశైవ క్షేత్రాలైన శ్రీశైలం, యాగంటి, మహానంది క్షేత్రాలకు కూడా బస్సులు ఏర్పాటు చేశారు. బస్టాండ్ నుంచి 10 కిలోమీటర్ల లోపు 30, అంత కంటే ఎక్కువ మంది భక్తులుంటే వారున్న ప్రాంతానికి ఈ ప్రత్యేక బస్సుల్ని పంపేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. గుంటూరు నుంచి పంచారామాలకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు ఛార్జీని రూ.1160గా నిర్ణయించారు. అల్ట్రా డీలక్స్ అయితే రూ.1110గా నిర్ణయించారు. అలాగే తెనాలి నుంచి సూపర్ లగ్జరీ రూ.1200, అల్ట్రా డీలక్స్ రూ.1150 ఛార్జీ ఉంటుంది. మంగళగిరి నుంచి అయితే సూపర్ లగ్జరీ రూ.1140, అల్ట్రా డీలక్స్ రూ.1090 ఉంటుంది. పొన్నూరు నుంచి అయితే సూపర్ లగ్జరీ రూ.1250, అల్ట్రా డీలక్స్ రూ.1200 ఉంటుంది. అలాగే త్రిశైవ క్షేత్రాలకు అయితే గుంటూరు నుంచి సూపర్ డీలక్స్ రూ.1440, అల్ట్రా డీలక్స్ అయితే రూ.1380, తెనాలి నుంచి సూపర్ లగ్జరీ రూ.1540, అల్ట్రా డీలక్స్ 1480, మంగళగిరి నుంచి సూపర్ లగ్జరీ రూ.1450, అల్ట్రా డీలక్స్ రూ.1510, పొన్నూరు నుంచి సూపర్ లగ్జరీ రూ.1510, అల్ట్రా డీలక్స్ రూ.1450 ఛార్జీ ఉంటాయి.

శ్రీకాళహస్తిలో గంజాయి స్వాధీనం... ఒకరి అరెస్ట్



శ్రీకాళహస్తి (చైతన్యరథం): ప్రాంతంలో గంజాయి అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్కుర్తి రైల్వే గేటు సమీపంలో తనిఖీలు నిర్వహించి.. అనుమానాస్పదంగా ఉన్న బర్రి మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి అక్రమంగా విక్రయించేందుకు తీసుకొచ్చిన 1,100 గ్రాముల గంజాయితో పాటు ఒక బైక్, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని విచారించగా, ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు వెల్లడించినట్లు సమాచారం. గంజాయి అక్రమ రవాణా, విక్రయాల వెనుక మరెవరైనా ఉన్నారా? ఈ వ్యవహారంలో ఇతర వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి నిల్వలు.. అక్రమ విక్రయాలు లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే ప్రజలు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం ఉంటే వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

పాల ధరలు పెంపు... లీటర్‌కు రూ. 2 నుంచి రూ. 6 వరకు, కొత్త రేట్లు



అమరావతి (చైతన్యరథం): దేశంలో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులకు మరో షాకింగ్ న్యూస్... ప్రముఖ డెయిరీ సంస్థలైన అమూల్, మదర్ డెయిరీలు తమ పాలు, పాల ఉత్పత్తుల ధరలను పెంచడానికి సిద్ధమవుతున్నాయి. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం వివిధ రకాల పాల ధరలలో మార్పులు ఇలా ఉండనున్నాయి. లీటరుకు రూ. 2 నుంచి రూ. 6 వరకు ధరలు పెరగనున్నాయి. టోన్డ్ మిల్క్ ధర లీటరుకు రూ. 2, ఫుల్ క్రీమ్ మిల్క్ ధర లీటరుకు రూ. 4, ఫుల్ క్రీమ్ బఫెలో మిల్క్ (గేదె పాలు) ధర లీటరుకు రూ. 6 చొప్పున పెరగనున్నాయి. నవంబర్ 12 నుంచి ఈ పెరిగిన ధరలు అమలులోకి రానున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో బల్క్ వెండింగ్ మెషీన్ల ద్వారా విక్రయించే టోన్డ్ మిల్క్ ధర లీటరుకు రూ. 58 నుంచి రూ. 60కి పెరగనుంది. ప్యాక్ చేసిన ఫుల్ క్రీమ్ పాల ధర లీటర్‌కు రూ. 72 నుంచి రూ. 76కి, అలాగే ప్యాక్ చేసిన టోన్డ్ మిల్క్ ధర టీటర్‌కు రూ. 60 నుంచి రూ. 62కి పెరుగనున్నాయి. పాల లభ్యత తగ్గడం, పాల సేకరణ వ్యయాలు పెరగడం, పాల ఉత్పత్తికి అవసరమైన ఇతర ఖర్చులు పెరగడమే ఈ ధరల పెంపునకు కారణమని తెలుస్తోంది. సాధారణంగా పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండే కాలంలో ధరలు స్థిరంగా ఉంటాయి. అయితే ప్రస్తుతం పాల సరఫరాలో ఏర్పడిన ఇబ్బందుల వల్ల డెయిరీ సంస్థలపై ఒత్తిడి పెరిగింది. దీనితో డెయిరీ సంస్థలు తమ ధరలను సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాడి రైతులు కూడా పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పశు గ్రాసం ధరలు పెరగడం వల్ల పాడి రైతులపై ఆర్థిక భారం పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని, పాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, సేకరణను మెరుగుపరచడానికి డెయిరీ సంస్థలు రైతుల నుంచి పాలను సేకరించే ధరను పెంచాయి. అమూల్ సంస్థ పాలలోని కొవ్వు శాతానికి అనుగుణంగా చెల్లించే సేకరణ ధరను కిలోగ్రాముకు రూ. 1,000కి పెంచిందని, దీనివల్ల రైతులకు లీటరు పాలుకు రూ. 60 కంటే ఎక్కువ ధర లభిస్తుందని సమాచారం.

చీరాలలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం



చీరాల (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చీరాల పట్టణ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన అఖండ విజయాన్ని పురస్కరించుకుని, విజయం సాధించిన కౌన్సిలర్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రజా సమస్యలపై పలు కీలక సూచనలు చేశారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదలపై పలు అంశాలను చర్చించారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, పట్టణంలో మౌలిక వసతులను మెరుగుపరిచి, అభివృద్ధి పనులు వేగవంతం చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దోగుపర్తి సురేష్ మరియు కౌన్సిలర్లు వార్డ్ ఇన్‌ఛార్జ్‌లు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం

- **రూ.100కు కిలో కందిపప్పు, రూ.25కు కిలో గోధుమపిండి, లీటర్ ఫాయాయిల్ రూ.125కు అందించనున్న పౌరసరఫరాల శాఖ**



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు నిత్యావసర వస్తువుల ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్‌ను రాయితీ ధరలకే అందించాలని నిర్ణయించింది. ఈ పథకం కింద కిలో కందిపప్పు రూ. 100కు, కిలో గోధుమపిండి రూ. 25కు, లీటరు పామాయిల్ రూ. 125కు కార్డుదారులకు అందుబాటులోకి రానుంది. సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల నిత్యావసరాల ధరలపై సమీక్ష నిర్వహించి అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లో కందిపప్పు రూ. 170 నుంచి రూ. 200 వరకు అమ్ముతున్న నేపథ్యంలో ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని స్పష్టం చేశారు. మంత్రివర్గ ఉపసంఘ సమావేశంలోనూ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద మూడు నెలల పాటు ఈ సరుకులు రాయితీపై పంపిణీ చేయనున్నారు.

రూ.300 కోట్లు రాయితీ

ఈ పథకం అమలుకు నెలకు సుమారు రూ. 100.20 కోట్లు, మూడు నెలలకు రూ. 300.60 కోట్లు రాయితీగా ప్రభుత్వం భరించనుంది. ధరల స్థిరీకరణ నిధి కింద కేంద్రం నుంచి 1.20 లక్షల టన్నుల కందులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా, 40,338 టన్నులు కేటాయించారు. ముడి కందుల లభ్యతను బట్టి సేకరణ, పప్పు తయారీకి ఒప్పందాలు చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పామాయిల్‌ను పారదర్శక పోటీ ప్రక్రియ ద్వారా సేకరించాలని, మూడు నెలల తర్వాత కార్యక్రమాన్ని పొడిగించాల్సి వస్తే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రతి రేషన్ కార్డుకు నెలకు ఒక కిలో కందిపప్పు, ఒక లీటరు పామాయిల్ అందించనున్నారు. గోధుమపిండి విషయంలో నెలవారీ కోటా 3,384 మెట్రిక్ టన్నులుగా నిర్ణయించారు. ఇది ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇచ్చే విధానంలో అందుబాటులో ఉంటుంది. డిసెంబర్ నెల నుంచి సంక్రాంతి వరకు ఈ పథకం కొనసాగే అవకాశం ఉంది. ఇలా మూడు వస్తువులు కలిపి రూ. 250కే అందడం వల్ల కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుంది.

ఇప్పటికే రైతు బజార్ల ద్వారా ఉల్లిపాయలు రూ. 35కు, ధరణి బ్రాండ్ బియ్యం రూ. 49-50కు అందుబాటులో ఉంచుతున్న నేపథ్యంలో తాజా నిర్ణయం మరో ముఖ్యమైన నిర్ణయంగా మారింది. ధరల నియంత్రణకు సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా పెంచి, అక్రమ రవాణాను అరికట్టే చర్యలు కూడా చేపడుతున్నారు. పేదలు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు అందరూ రోజువారీ ఖర్చుల్లో భాగమైన ఈ వస్తువుల ధరలు పెరిగి ఇబ్బంది పడుతున్న సమయంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సాధారణ ప్రజలకు నిజమైన ఉపశమనం కలిగిస్తుంది. రేషన్ దుకాణాల్లో సకాలంలో సరుకులు అందుబాటులోకి రావాలని, నాణ్యతపై దృష్టి సారించాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ పథకం విజయవంతంగా అమలు కావడంతో రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు నియంత్రణలోకి రావడమే కాకుండా, ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని ఆశిస్తున్నారు.

ఆరు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ఆంధ్రప్రదేశ్ కైవసం

- **25 శాతం అవార్డులతో మొదటి స్థానంలో ఏపీ : స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం**



న్యూఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వివిధ కేటగిరీల్లో మొత్తం ఆరు జాతీయ అవార్డులు లభించాయి. రాష్ట్రం తరఫున ఈ అవార్డులను పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం రాష్ట్రపతి చేతుల మీదగా అందుకున్నారు. మన రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్లకు, కుప్పం మున్సిపాల్టీకి జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు లభించాయి. స్వచ్ఛత, పారిశుద్ధ్య నిర్వహణలో రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలు సాధించిన పురోగతికి ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయి.

25 శాతం అవార్డులతో మొదటి స్థానంలో ఏపీ : పట్టాభిరామ్

అర్హత కలిగిన అవార్డుల్లో 25 శాతం సాధించి జాతీయ స్థాయిలో ఏపీ మొదటి స్థానం దక్కించుకుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం చెప్పారు. దేశంలో అత్యధిక అవార్డులు సాధించిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అవార్డులు అందుకున్న సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు దిశానిర్దేశం, మంత్రి నారాయణ నాయకత్వంలో మెరుగైన ఫలితాలు సాధించినట్లు పట్టాభిరామ్ చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 57 మున్సిపాలిటీలను ఫోకస్ యూఎల్‌బీలుగా గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అవార్డుల కోసం 3-4 నెలల ముందుగానే ప్రత్యేక కన్సల్టెంట్లతో మున్సిపాలిటీల సిబ్బందికి శిక్షణ, మార్గదర్శకత్వం వహించినట్లు వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మంచి ఫలితాలు సాధించామన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన 'స్వచ్ఛ షహర్ జోడీ' అవార్డు విభాగంలో కుప్పం మున్సిపాలిటీకి గుర్తింపు లభించినట్లు తెలిపారు.

మిలియన్ ప్లస్ జనాభా నగరాల విభాగంలో విశాఖ ఫస్ట్

మిలియన్ ప్లస్ జనాభా కలిగిన నగరాల విభాగంలో విశాఖపట్నానికి జాతీయ స్థాయిలో నంబర్ వన్ ర్యాంక్ వచ్చినట్లు పట్టాభిరామ్ తెలిపారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగుతున్న సందర్భంగా ఈ అవార్డు లభించడం గర్వకారణంగా భావిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మంత్రి నారాయణను ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. ఏపీలో నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి ప్రశంసించారన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేసేలా తగిన మార్గదర్శకాలు సూచిస్తామని కేంద్ర మంత్రి తెలిపినట్లు చెప్పారు. ఏపీని లెగసీ వేస్ట్ ఫ్రీ, డంప్‌యార్డ్ ఫ్రీ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పేర్కొన్నారు. వేస్ట్ ప్రాసెసింగ్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ పాలసీ అమలుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

మంత్రి నారాలోకేష్‌కు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఘన స్వాగతం

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖలో నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు విశాఖకు విచ్చేసిన మానవ వనరులు, ఐటీ శాఖమంత్రి నారా లోకేష్‌కి ఘన స్వాగతం లభించింది. మంత్రి నారా లోకేష్ బుధవారం సాయంత్రం ఐఎన్ఎస్ డేగ వద్దకు చేరుకున్న సమయంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ కృషి చేస్తున్నారని ఎం.వి.ప్రణవ్‌గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంగ్లాండ్‌లో ఘనంగా దీపావళి



'కోవెంట్రీ తెలుగు అసోసియేషన్' ఆధ్వర్యంలో వేడుకలు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, ఫ్యాషన్ వాక్



కోవెంట్రీ (లండన్): ఇంగ్లాండ్‌లోని కోవెంట్రీలో 'కోవెంట్రీ తెలుగు అసోసియేషన్' ఆధ్వర్యంలో 'రెడ్ రోజ్ ఎరీనా'లో దీపావళి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కోవెంట్రీ, రగ్బీలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు కుటుంబాలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై చిన్నారుల యాంకరింగ్, నృత్య ప్రదర్శనలు, ఆటలు, పాటలతో పాటు వినోదభరితమైన కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. చిన్నారులతో కలిసి పద్మావతి పులమారశెట్టి ప్రదర్శించిన 'నవదుర్గ' నృత్యం ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



దీపావళి ఇతివృత్తంతో చిన్నారులు ప్రదర్శించిన సంగీత కార్యక్రమం ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. వీటితో పాటు నిర్వహించిన మెట్ గాలా ఫ్యాషన్ వాక్, భక్తి ప్రధానమైన కార్యక్రమాలు వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చాయి. వేడుకల ముగింపులో అతిథులకు రుచికరమైన విందు భోజనం అందించడంతో పాటు రిటర్న్ గిఫ్ట్‌లుగా స్వీట్లు, పటాసులు అందజేశారు.





కాలిఫోర్నియాలో దీపావళి, గోవర్ధన పూజ

కాలిఫోర్నియా: కాలిఫోర్నియాలోని వైదిక విద్యా గణపతి సెంటర్ దేవాలయంలో దీపావళి ఉత్సవాలు, గోవర్ధన పూజ ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు భక్తులు అధిక సంఖ్యలో అత్యంత ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపారు. దేవస్థానం నిర్వాహకులు వివిధ రకాలైన కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఎంతో సంప్రదాయంగా వస్తున్న కొన్ని ఉత్సవాలను కూడా నిర్వహించారు. భక్తులు మూడు రోజులూ దీపాలు వెలిగించారు. రథయాత్ర జరిపారు. స్థానికులు వివిధ రకాలైన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరి రోజు లక్ష్మీ కుబేర పూజతో పాటు గోవర్ధన పూజను శ్రద్ధా భక్తులతో నిర్వహించారు. ప్రతి రోజు దేవాలయంలో ప్రత్యేక ప్రసాదాలను నివేదించి భక్తులకు ప్రసాదంగా పంచారు. ప్రత్యేకంగా కిడ్స్ దీప పూజ, హారతి జరిపారు.



'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్'

నూతన టీమ్ ప్రకటన

నూతన అధ్యక్షులుగా సోనియా లూథర్, అజంత తాలూక్‌దార్



చికాగో (అమెరికా): చికాగోకి చెందిన ప్రముఖ భారతీయ-అమెరికన్ సంస్థ "అమెరికన్ సంస్థ 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్' తన నూతన టీమ్‌ను ప్రకటించింది. దీపావళి వేడుకలతో పాటు బోర్డు సమావేశం జరిగింది. సోనియా లూథర్, అజంత తాలూక్‌దార్ అనే ఇద్దరు మహిళలను 2027 సంవత్సరానికి గాను నూతన అధ్యక్షులుగా ప్రకటించారు. బర్ రిడ్జ్‌లోని క్రౌన్ ప్లాజా హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎఫ్ఐఏ వ్యవస్థాపక చైర్మన్ సునీల్ షా ఈ ప్రకటన చేశారు. ప్రస్తుత అధ్యక్షులు అల్తాఫ్ బుఖారీ, రిచా చంద్ స్థానంలో వారిద్దరూ బాధ్యతలు స్వీకరిస్తారు. పరిచయం తర్వాత లూథర్, తాలుక్‌దార్ హాజరైన వారినుద్దేశించి ప్రసంగించారు, అనంతరం వారిని సన్మానించారు. ప్రధాన కార్యదర్శి కమలేష్ కపూర్ సమావేశాన్ని ప్రారంభించి గత ఏడాది కాలంలో సంస్థ చేపట్టిన కార్యక్రమాల సారాంశాన్ని వివరించారు. 2026వ సంవత్సరం ఎఫ్ఐఏ చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన సంవత్సరాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్న షా... సంస్థకు నాయకత్వం వహించిన బుఖారీ, చంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు జాయింట్ ట్రెజరర్ పాయల్ షా సంస్థ వార్షిక ఆర్థిక వివరాలను ప్రకటించారు. సభ్యులు జీవితకాల సభ్యత్వాన్ని తీసుకునేలా ప్రోత్సహించారు. అక్టోబరులో చేరిన సభ్యులను సభికులకు పరిచయం చేశారు. బుఖారీ, చంద్‌లతో పాటు గత అధ్యక్షులు అను మల్హోత్రా, హితేష్ గాంధీ, వినీత గులాబాని, ప్రతిభా జైరత్, ఎఫ్ఐఏ ఫస్ట్ లేడీ రీటా షా కూడా సభికులను ఉద్దేశించి ప్రసంగించారు.

సలహా మండలి సభ్యులు బ్రిజ్ శర్మ, కీర్తి రావూరి, పింకీ ఠక్కర్, దినేష్ ఠక్కర్, శ్రుజల్ పటేల్, డాక్టర్ అరుణ్ నారంగ్, ప్రదీప్ శుక్లా, విపాన్ వధేరా... గత దశాబ్ద కాలానికి పైగా ఈ సంస్థ చేపట్టిన పనులపై మాట్లాడారు. కార్యక్రమంలో జీవితకాల సభ్యులకు గుర్తింపు, సంస్థ మద్దతుదారులకు ట్రోఫీలు, అక్టోబరు, నవంబరు నెలల్లో పుట్టిన సభ్యులకు కేక్ కటింగ్, గ్రూప్ ఫొటోలు, రోబోట్ నృత్య ప్రదర్శన, ఎఫ్ఐఏ గాయకుల సంగీత కార్యక్రమాలు జరిగాయి.

ఎఫ్ఐఏ దాత్యత్వం: 20వేల పౌండ్ల ఆహార పదార్థాల విరాళం

రోడ్ ఐలాండ్: 'ఫౌండేషన్ ఆఫ్ ఇండియన్ అమెరికన్స్ (FIA) న్యూ ఇంగ్లాండ్' ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రోడ్ ఐలాండ్‌లోని కుటుంబాల కోసం 20వేల పౌండ్లకు పైగా ఆహార పదార్థాలను విరాళంగా అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రావిడెన్స్‌లోని గవర్నర్ ఎగ్జిక్యూటివ్ హాల్‌లో సాంస్కృతిక ఉత్సవాలతో పాటు ఆహార విరాళాల కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ అమెరికన్ సమాజ సభ్యులు, ఎన్నికైన అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. యుఎస్ ప్రతినిధి గేబ్ అమో, బోస్టన్‌లోని భారత కాన్సుల్ జనరల్ రఘురామ్.ఎస్., ఈస్ట్ ప్రావిడెన్స్ మేయర్ రాబర్టో "బాబ్" డాసిల్వా, లింకన్ టౌన్ అడ్మినిస్ట్రేటర్ ఫిలిప్ జి.గౌల్డ్ వేడుకలకు హాజరయ్యారు. గవర్నర్ డాన్ మెక్కీ కార్యాలయం, సెనేటర్ జాక్ రీడ్ కార్యాలయ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమం దీప ప్రజ్వలనతో ప్రారంభమైంది. అనంతరం, చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించే విజయమనే దీపావళి సందేశాన్ని అతిథులు అందజేశారు.

తమ వేడుకలను సేవా కార్యక్రమాలతో మిళితం చేస్తున్న భారతీయ అమెరికన్ సమాజాన్ని అమో ప్రశంసించారు. అవసరంలో ఉన్న ప్రజలకు వారు అందిస్తున్న మద్దతు సానుభూతి, కరుణలకు నిదర్శనమని ఆయన అభివర్ణించారు. గత సంవత్సరం సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ ప్రయోజనాలకు అంతరాయం కలిగిన సమయంలో ఎఫ్ఐఏ న్యూ ఇంగ్లాండ్ అందించిన సహాయాన్ని గౌల్డ్ గుర్తు చేసుకున్నారు. ఆ సంస్థ అందించిన ఆహార విరాళం లింకన్‌లోని ప్రతి ఫుడ్ ప్యాంట్రీకి చేరి, ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న కుటుంబాలకు సహాయపడిందన్నారు. ఎఫ్ఐఏ న్యూ ఇంగ్లాండ్ అధ్యక్షుడు అభిషేక్ సింగ్ మాట్లాడుతూ ఈ ఆహార పంపిణీ కార్యక్రమం దీపావళి స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. "మనలో ప్రతి ఒక్కరం, మనకు సాధ్యమైన రీతిలో, అత్యంత అవసరంలో ఉన్నవారి జీవితాల్లో వెలుగును నింపినప్పుడు, మన దీపావళి వేడుకల ఉద్దేశ్యం నెరవేరుతుంది" అని సింగ్ అన్నారు.



తెలుగుదేశం ఆస్ట్రేలియా ఆధ్వర్యంలో యోగా శిక్షణ

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో మహిళలు, బాలికల కోసం తెలుగుదేశం ఆస్ట్రేలియా ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటిదాకా మూడు సెషన్లు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ తరగతుల్లో పాల్గొంటున్న మహిళలు యోగా సాధన తమ దైనందిన జీవితానికి ఎంతో ఉపయోగకరంగా ఉందని, మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం, పని, వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యత సాధించడానికి దోహదపడుతోందని తెలిపారు. యోగా శిక్షణ తరగతులను ఈషా ఫౌండేషన్‌కు చెందిన శిక్షకులు నిర్వహిస్తున్నారు. మొత్తం కార్యక్రమంలో భాగంగా చివరి సెషన్‌ను ఈ నెల 21న నిర్వహించనున్నారు. ప్రతి సెషన్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్న మహిళలు, బాలికలకు... యోగా శిక్షణ అందిస్తున్న ఈషా ఫౌండేషన్‌కు తెలుగుదేశం ఆస్ట్రేలియా కార్యవర్గం హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసింది.

దీపావళినాడే కాలుష్యం గుర్తొస్తే ఎలా!

విమర్శలపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందన



దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడంతో దేశంలోని పలు నగరాల్లో వాయు కాలుష్యం పెరిగిందన్న ఆందోళనలపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. పండుగ సమయంలో ప్రజలు టపాసులు కాలిస్తేనే కొందరికి కాలుష్యం గుర్తుకొస్తోందని వ్యాఖ్యానించారు. ఒకరోజు బాణసంచా కాల్చడం వల్ల ఏర్పడిన కాలుష్యం తొందరగానే తగ్గిపోతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. దీపావళి వేడుకలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి నిషేధాలూ విధించలేదని స్పష్టం చేశారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో యోగి ఆదిత్యనాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీపావళి వేడుకలను ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారని, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారని తెలిపారు. దీనిపై కొందరు కాలుష్యం పెరిగిందంటూ విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఒకరోజు టపాసులు కాల్చితే కాలుష్యం గురించి మాట్లాడుతున్నారని, కానీ అవినీతి కార్యకలాపాలతో మొత్తం వ్యవస్థను కలుషితం చేసిన వారిని ఎవరూ ప్రశ్నించడం లేదని వ్యాఖ్యానించారు. దీపావళి వేడుకల సమయంలో అయోధ్యలో తాను కూడా బాణసంచా కాల్చే కార్యక్రమంలో పాల్గొన్నట్లు యోగి తెలిపారు. 2017కు ముందు ఉత్తరప్రదేశ్‌లో హోలీ, దీపావళి, విజయదశమి, జన్మాష్టమి, శివరాత్రి, క్రిస్మస్, ఈద్ వంటి పండుగలు వచ్చినప్పుడు అల్లర్లు జరిగేవని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజలు ప్రశాంతంగా పండుగలు జరుపుకునే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. పండుగల సమయంలో ప్రజలు సంతోషంగా వేడుకలు జరుపుకుంటే కాలుష్యం గురించి మాట్లాడుతున్నారని, ఇతర తప్పిదాల విషయంలో మాత్రం అదే స్థాయిలో ప్రశ్నలు రావడం లేదని విమర్శించారు.

యూపీ కూటమిలో అసెంబ్లీ సీట్ల సర్దుబాటు

మిత్రపక్షాలకు 60 సీట్లిచ్చే ఆలోచనలో అధికార బీజేపీ



యూపీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్డీయే కూటమి బలోపేతం దిశగా బీజేపీ ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్రంలో కూటమి పార్టీలకు 60 సీట్లు ఇచ్చే అంశాన్ని బీజేపీ పరిశీలిస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా మిత్రపక్షాలైన రాష్ట్రీయ లోక్ దళ్, భారతీయ సమాజ్ పార్టీ, అప్నా దళ్, నిషాద్ పార్టీలను ఒక్కతాటిపైకి తెచ్చే ఫార్ములపై కసరత్తు చేస్తోంది. కుల, ప్రాంతీయ సమీకరణాల దృష్ట్యా బీజేపీ విస్తృత స్థాయి కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సీట్ల పంపకాలు విజయవంతంగా పూర్తి చేయడమే యూపీలో ఎన్డీయే ఐక్యతకు అతిపెద్ద పరీక్ష అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మిత్ర పక్షాల కోసం బీజేపీ ఎన్ని సీట్లను వదులుకుంటుందనే అంశం ప్రస్తుతం ఉత్కంఠ రేపుతోంది. యూపీ అసెంబ్లీలో మొత్తం 403 సీట్లు ఉన్న విషయం తెలిసిందే. ఇక ఈ అంశాలపై బీజేపీ ప్రతినిధి మనీష్ శుక్లా మాట్లాడారు. 2027 ఎన్నికల్లో భారీ విజయం సాధించడమే ఎన్డీయే పక్షాల లక్ష్యమని చెప్పారు. ఎన్నికల్లో ప్రజల పూర్తిస్థాయి మద్దతు లభిస్తే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడం సాధ్యమవుతుందని అన్నారు. సీట్ల పంపకాల అంశం ఎన్డీయేలో చర్చించడమే సబబని అన్నారు. ఈ పరిణామాలపై సమాజ్ వాదీ పార్టీ విమర్శలు గుప్పించింది. వచ్చే ఎన్నికల ఫలితాలపై బీజేపీ ఆందోళనతో ఉందని చెప్పింది. అందుకే మిత్రపక్షాలకు సీట్లు ఇచ్చేందుకు దిగొచ్చిందని వ్యాఖ్యానించింది. సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న నమ్మకం బీజేపీకి లేదని పేర్కొంది. రాష్ట్రంలో ప్రజలకు బీజేపీ దూరమైందని ఎస్పీ నేత దినకర్ జైన్ అన్నారు. ఎన్డీయే కూటమిని మరింత విస్తరించినా విజయం దక్కదని స్పష్టం చేశారు.



మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌కర్‌కు తీవ్ర అస్వస్థత

ఎయిమ్స్‌లో ఐఎల్‌బీఎస్ వైద్య బృందం వైద్యం

భారత మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం న్యూఢిల్లీలో నడుస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అనంతరం స్పృహ కొల్పోయారు. దీంతో సిబ్బంది వెంటనే ఆయనను పీసీఆర్ వాహనంలో ఇంటికి తరలించారు. ఆయనకు వైద్య బృందం చికిత్స అందించింది. అయితే జగదీప్ ధనకర్ ఆరోగ్యం ఆందోళనకరంగా మారింది. దీంతో ఆయనను హుటాహుటిన ఎయిమ్స్‌కు తరలించారు. ఎయిమ్స్ వైద్యుడు సందీప్ సేథి సారథ్యంలో ఐఎల్‌బీఎస్ వైద్య బృందం ఆయనకు వైద్యం అందిస్తుంది. జగదీప్ ధన్‌కర్ ఆరోగ్యంపై ఎయిమ్స్ వర్గాలు ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. గత రెండేళ్లుగా జగదీప్ ధన్‌కర్ తరచూ అనారోగ్యానికి గురవుతున్న సంగతి తెలిసిందే. 2022లో భారత 14వ ఉప రాష్ట్రపతిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. 2025, ఆగస్టులో ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు ఆయన పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా పని చేశారు.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పులు

ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లకు గాయాలు

జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులు బుధవారం కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. కుల్గాం జిల్లాలోని సీఆర్పీఎఫ్ చెక్‌పాయింట్ వద్ద ఈ ఘటన జరిగింది. టెర్రరిస్టులు బైకులపై చెక్‌పాయింట్ వద్దకు వచ్చి జవాన్లపై కాల్పులు జరిపి పారిపోయారు. జవాన్లలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అప్రమత్తమైన బలగాలు.. వెంటనే ఎదురు కాల్పులు జరిపాయి. అలాగే క్విక్ రియాక్షన్ టీమ్స్ కూడా ఘటనా స్థలానికి చేరుకున్నాయి. భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. పారిపోయిన ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. చెక్ పాయింట్ ప్రాంతంలో భద్రతను పూర్తిగా కట్టుదిట్టం చేశారు. ఆ ప్రాంతంలో రాకపోకలు కొనసాగించే వాహనదారులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.





ఎయిరిండియా విమానానికి హైజాక్ బెదిరింపు

విమానాశ్రయ అధికారులు అప్రమత్తం, ముమ్మరంగా తనిఖీ చర్యలు

కోల్‌కతా నుంచి ముంబై వెళ్లాల్సిన ఎయిరిండియా విమానంలో హైజాక్ బెదిరింపు నోట్ కనిపించడం కలకలం రేపింది. విమానం టేకాఫ్ కావడానికి ముందు అందులో అనుమానాస్పద బెదిరింపు నోట్ కనిపించడంతో విమానాశ్రయ అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే విమానంలోని ప్రయాణికులను కిందకు దించారు. భద్రతా తనిఖీల కోసం విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించారు. భద్రతా సంస్థలు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టాయి. ఈ ఘటనతో విమానాశ్రయంలో కొంతసేపు ఆందోళన నెలకొంది. గత అక్టోబర్‌లో, పుకెట్ నుంచి వచ్చిన ఒక విమానంలోని టాయిలెట్ అద్దంపై 'విమానంలో బాంబు' అని రాసి ఉండటాన్ని గమనించారు. ఆ ఘటన తర్వాత కోల్‌కతా విమానాశ్రయంలో పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. విమానానికి హైజాక్ లేదా బాంబు బెదిరింపు వచ్చినప్పుడు అధికారులు దాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటారు.

విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు ప్రయాణికులు, వారి సామాన్లను కూడా పరిశీలిస్తారు. అనుమానాస్పద వస్తువులు లేవని నిర్ధారించిన తర్వాతే విమానానికి తిరిగి అనుమతి ఇస్తారు. ప్రస్తుతం కోల్‌కతా విమానాశ్రయంలో ఎయిరిండియా విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

యుద్ధఖైదీల అప్పగింతకు రష్యా, ఉక్రెయిన్ అంగీకారం

అమెరికా చొరవతో కొలిక్కి.. భూభాగాలపై ఏకాభ్రియమే సంక్లిష్టం



అమెరికా చొరవతో గత రెండు రోజులుగా రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న చర్చల్లో కొంత పురోగతి కనిపించింది. యుద్ధ ఖైదీలను పరస్పరం అప్పగించేందుకు ఇరు దేశాలు తాజాగా అంగీకరించాయి. అబుదాబీ వేదికగా జరుగుతున్న చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరినట్టు రష్యా తరపున చర్చల్లో పాల్గొన్న వ్లాదిమిర్ మెదిన్‌స్కీ తెలిపారు. ఇతరత్రా అంశాలపై కూడా రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు వివరిస్తానని చెప్పారు. చర్చల్లో గుర్తించిన అంశాలపై మరింత పురోగతి సాధించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఇలాంటి యుద్ధ ఖైదీల అప్పగింత కార్యక్రమాలు గతంలో కూడా జరిగాయని అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. ఇంతటి ఉన్నతస్థాయి దౌత్యచర్చలు లేకుండానే ఇరు దేశాలు సుమారు 100 నుంచి 300 వరకూ ఖైదీలను ప్రత్యర్థి దేశానికి పలుమార్లు అప్పగించాయని అన్నారు. ఈసారి కార్యక్రమానికి కాస్తంత ప్రాధాన్యం ఏర్పడాలంటే కనీసం 1000, 1500 కొంత వరకూ అవగాహన కుదిరిందని అన్నారు. అయితే, యుద్ధం ముగించే దిశగా ఆశించిన మేర అడుగులు పడలేదని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇక ఎంతమంది యుద్ధ ఖైదీలను అప్పగించేదీ గురువారం నిర్ణయిస్తామని అమెరికా ప్రత్యేక ప్రతినిధి జేరెడ్ కుష్నర్ తెలిపారు. చర్చల్లో కుదిరిన ఏకాభిప్రాయాల గురించి తాను, మరో ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో కలిసి మాస్కోలో మంది ఖైదీలను ఇరు దేశాలు పరస్పరం అప్పగించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. భూభాగాల విషయంలో ఏకాభ్రియాన్ని సాధించడమే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని చెప్పారు. భవిష్యత్తులో కూడా మరిన్ని చర్చలు జరుగుతాయని రష్యా ప్రతినిధి మెదిన్‌స్కీ తెలిపారు. ఈ చర్చల్లో ఐరోపా సమాఖ్య పాల్గొన్నా తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆయన అన్నారు.

దద్దరిల్లిన జ్రాయెల్ పార్లమెంట్



అసాధారణ, నాటకీయ పరిణామాలు

ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో (కెస్సెట్) ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రసంగిస్తున్న సమయంలో అసాధారణ, నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశంలో జాతీయ ఐక్యత గురించి ప్రధాని మాట్లాడుతున్న తరుణంలో, ఆయన భార్య సారా నెతన్యాహు, నెతన్యాహు రాజకీయ ప్రత్యర్థి మధ్య బహిరంగంగా మాటల యుద్ధం జరిగింది. ప్రధాని నెతన్యాహు పార్లమెంట్‌లో ప్రసంగిస్తుండగా, ఆయన రాజకీయ ప్రత్యర్థి (నఫ్తాలి బెన్నెట్) మధ్యలో అడ్డు తగిలారు. ప్రధాని సలహాదారులకు ఖతార్‌తో ఉన్న సంబంధాలు, అలాగే అక్టోబర్ 7 దాడికి సంబంధించిన దర్యాప్తు విషయాలపై ఆయన నిలదీశారు. ఈ చర్చ కేవలం నాయకుల మధ్యే ఆగిపోకుండా, గ్యాలరీ ముందు వరుసలో కూర్చున్న ప్రధాని భార్య సారా నెతన్యాహు నేరుగా రంగంలోకి దిగారు. తన సీటు నుంచే ప్రత్యర్థిపై ఆమె గట్టిగా కేకలు వేస్తూ వాగ్వాదానికి దిగడంతో పార్లమెంట్‌లో కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. సభా ప్రాంగణంలో జరిగిన ఈ హడావుడితో ప్రసంగం ఆపుతున్నట్లుగా ప్రధాని నెతన్యాహు కూడా ఒక్కసారిగా అటువైపు తిరిగి చూడాల్సి వచ్చింది.



ఇజ్రాయెల్ టూరిస్టు ఆకతాయి చేష్టలు

శ్రీలంక మహిళా గైడ్‌ను సముద్రంలోకి తోసేసి పైశాచికానందం

సముద్రంలో వెళ్తున్న ఓ పడవపై నుంచి శ్రీలంక గైడ్‌ను ఇజ్రాయెల్ పర్యాటకుడు సముద్రంలోకి తోసేశాడు. శ్రీలంకలో ఏ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందో తెలియాల్సి ఉంది. ఓ పడవలో ఇజ్రాయెల్ పర్యాటకులతో పాటు శ్రీలంక మహిళా గైడ్ కూడా వెళుతున్నారు. ఆ గైడ్ నీరు తాగుతుండగా ఆమె పక్కన కూర్చున్న ఇజ్రాయెల్ టూరిస్టు ఒక్కసారిగా ఆమెను సముద్రంలోకి తోసేశాడు. ఆమెకు సాయం చేయాల్సిన ఇతర పర్యాటకులు పడవలోనే ఉండి నవ్వుతూ కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. దీంతో నెటిజన్లు ఆ ఇజ్రాయెల్ పర్యాటకుడి తీరుపై దుమ్మెత్తి పోశారు.

ఎన్విడియా ఎఫ్‌బీఐ...

ట్రంప్‌కు ముందే తెలుసు..!

చైనాకు చెందిన ఓ మహిళతో ఎన్విడియా సంస్థ సీఈవో జెన్సన్ హువాంగ్‌కు సంబంధం ఉన్నట్టు బయటపడడం అమెరికాలోనే కాదు.. అంతర్జాతీయ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఏడాది క్రితమే సమాచారం ఉందని డెమోక్రటిక్ పార్టీ నేత, సెనేట్ మైనారిటీ నాయకుడు చక్ షుమర్ వెల్లడించడం మరింత సంచలనంగా మారింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పర్యవేక్షణలో రూపొందిన రహస్య నిఘా నివేదిక ద్వారా ఈ విషయం ట్రంప్‌నకు తెలిసిందని ఆయన తెలిపారు. జెన్సన్ హువాంగ్‌కు ఆలిస్ హువాంగ్ అనే చైనా మహిళతో సన్నిహిత సంబంధం ఉన్నట్లు బయటపడింది. జెన్సన్ కూడా ఈ విషయాన్ని అంగీకరించారు. ఆలిస్ హువాంగ్‌కు చైనా విదేశీ నిఘా వ్యవస్థతో సంబంధాలు ఉన్నాయని, ముఖ్యంగా చైనా ప్రభుత్వ భద్రతా మంత్రిత్వ శాఖతో ఆమె నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని అమెరికా నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఈ సమాచారం ఏడాది క్రితమే ట్రంప్‌నకు చేరినట్టు సమాచారం. 2025 చివర్లోనే ఎఫ్‌బీఐ అధికారులు ఈ సమాచారాన్ని చట్ట సభ్యులకు ఇచ్చారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై అమెరికా డెమోక్రటిక్ నేత చక్ షుమర్ తీవ్రంగా స్పందించారు. జెన్సన్ హువాంగ్‌కు చైనా గూఢచారిగా అనుమానిస్తున్న మహిళతో సంబంధం ఉన్నట్లు ఏడాది క్రితమే ట్రంప్‌నకు సమాచారం అందినప్పటికీ ఆయన ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడాల్సిన అధ్యక్షుడు తన స్నేహితులను కాపాడటంలో బిజీగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఎన్విడియా వంటి జాతీయ భద్రతకు కీలకమైన సంస్థ అధిపతిపై ఇలాంటి అనుమానాలు వచ్చినప్పుడు ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సి ఉందన్నారు. హువాంగ్‌ను ట్రంప్ బీజింగ్ పర్యటనకు తీసుకెళ్లడం, చైనాకు అత్యాధునిక ఏఐ చిప్స్ విక్రయించేందుకు ఆయన సలహాలను పరిగణనలోకి తీసుకోవడం వంటి అంశాలపై కూడా షుమర్ ప్రశ్నలు లేవనెత్తారు. అంతేకాకుండా ఎన్విడియా నుంచి ట్రంప్ వైట్‌హౌస్ బాల్‌రూమ్ ప్రాజెక్టుకు 2.5 కోట్ల డాలర్ల విరాళం అందిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్‌కు పూర్తి వివరాలు వెల్లడించాలని, అమెరికా నిఘా సంస్థల నుంచి సెనేట్, ప్రతినిధుల సభ నిఘా కమిటీలకు వెంటనే సమాచారం అందించాలని డిమాండ్ చేశారు.



యుద్ధంపై ముగింపు పలుకులు!

ఆచరణలో అమెరికా, ఇరాన్ ఎవరి ధోరణి వారిదే



అమెరికాతో గత ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇరాన్ మరోసారి దౌత్యపరమైన ప్రయత్నాలకు సిద్ధమైంది. అయితే, ఇందుకోసం అమెరికా తమ షరతులను అంగీకరించాలని స్పష్టం చేసింది. సైనిక చర్యలతోనో, ఆంక్షలను మరింత కఠినతరం చేయడం ద్వారానో సమస్య పరిష్కారం కాదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. పరస్పర గౌరవంతో చర్చలు జరిపి, తమ డిమాండ్లను పరిష్కరించినప్పుడే యుద్ధానికి ముగింపు సాధ్యమని వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ రెండు రోజుల గడువుతో ఒక ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. అయితే, అందుకు అమెరికా తమ షరతులను అంగీకరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అన్ని రంగాల్లో యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేయాలని, విదేశాల్లో నిలిపివేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, ఇరాన్‌పై విధించిన చమురు ఆంక్షలను ఎత్తివేయాలని, ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా విధించిన సముద్ర దిగ్బంధనాన్ని ముగించాలని కోరింది. ఈ షరతులకు అమెరికా అంగీకరిస్తే రెండు రోజుల్లో హోర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని ప్రకటించింది. ఇరాన్‌తో యుద్ధం దాదాపు ముగిసినట్టేనని, యుద్ధానికి ముగింపు పలికే దిశగా సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. యుద్ధం మళ్లీ తీవ్రరూపం దాల్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని సంకేతాలిచ్చారు. అయితే సైనిక మార్గాల ద్వారా లేదా ఆంక్షలను తీవ్రతరం చేయడం ద్వారా ఇరాన్‌తో ఉన్న వివాదాన్ని పరిష్కరించలేరని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. తమ డిమాండ్లు, షరతులు ఇప్పటికే అమెరికా ముందుంచామని, అవి ఇప్పటికీ చర్చల కోసం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇరాన్‌పై యుద్ధం ఇక దాదాపుగా ముగిసినట్లేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఇకముందు ఇరాన్‌పై భారీ స్థాయిలో దాడులను తిరిగి ప్రారంభించే అవకాశం లేదని సంకేతాలు ఇచ్చారు. మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దీనితో పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడతాయని, హర్మూజ్ తెరుకుంటుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. చమురు ధరలు దిగివస్తున్నాయి. మంగళవారం బ్రెంట్ క్రూడ్ సుమారు మూడు శాతం పడిపోయి బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరింది. అమెరికా, ఇరాన్ మధ్య శాంతిచర్చల కోసం మధ్యవర్తిత్వం చేస్తున్న ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్‌తో శ్వేతసౌధంలో భేటీ అయిన ట్రంప్ అనంతరం మీడియాతో మాట్లాడారు. “ఇరాన్ మిలిటరీని పూర్తిగా దెబ్బతీశాం. అణుశుద్ధి సామర్థ్యంలో 85శాతం ధ్వంసం చేశాం. ఇరాన్ ఇప్పుడు చర్చల కోసం మర్యాదగా మాట్లాడుతోంది. దీనితో యథాతథ స్థితి కొనసాగించాలని భావిస్తున్నాం. ఇరాన్ అణు కార్యక్రమంపై ఒప్పందం కుదిరి, హర్మూజ్ జలసంధి తెరుచుకుంటే.. ఆ దేశంపై దాడులు చేసే అవకాశం తక్కువ. కానీ చర్చలు విఫలమైనా, పరిణామాలు మళ్లీ మొదటికి వచ్చినా.. మళ్లీ దాడులకు వెనుకాడబోం” అని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు ఎదుర్కొన్న ఆ దేశ ప్రధాని నెతన్యాహు ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసి, పరువు కాపాడుకోవాలని భావించారు. ఈ క్రమంలో ప్రతిరోజూ ట్రంప్‌కు ఫోన్ చేసి యుద్ధం మొదలుపెడదామా అని అడుగుతూ వచ్చారు. ముఖ్యంగా అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు ఓడిపోయిన తర్వాత దాడుల కోసం తీవ్రంగా ఒత్తిడి చేశారు. కానీ ఎన్నికల ఫలితాలు, సలహాదారుల సూచనలు, గల్ఫ్‌లోని మిత్రదేశాల విజ్ఞప్తి మేరకు ఇరాన్‌పై దాడి వద్దని, దౌత్యపరిష్కారానికి ప్రయత్నిద్దామని ట్రంప్ స్పష్టం చేస్తూ వచ్చారు. శ్వేతసౌధంలోని కీలక అధికారులను ఉటంకిస్తూ.. ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ఈ వివరాలు వెల్లడించింది.

కలలు కనాలి... నమ్మకంతో ముందుకు సాగాలి!

ఆర్యవీర్ సెహ్వాగ్ ఇంటర్వ్యూలో విరాట్ కోహ్లీ పిలుపు





2017లో భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీని ఆర్యవీర్ ఇంటర్వ్యూ చేసిన వీడియో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. అండర్ 19 ఆసియా కప్‌లో భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్.. 160 పరుగులు చేసి వార్తల్లో నిలిచాడు. ఈ క్రమంలో ఆర్యవీర్‌కు సంబంధించిన ఓ పాత వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2017లో ఓ కార్యక్రమంలో అప్పటి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని చిన్నారి ఆర్యవీర్ ఇంటర్వ్యూ చేశాడు. మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్న కోహ్లీని పలు ఆసక్తికరమైన ప్రశ్నలు అడిగాడు. ఈ ఇంటర్వ్యూలో కోహ్లీకి వీరేంద్ర సెహ్వాగ్‌తో మొదటిసారి పరిచయం ఎలా ఏర్పడిందని ఆర్యవీర్ ప్రశ్నించాడు. దీనికి స్పందించిన కోహ్లీ.. ఢిల్లీలో ఓ రాష్ట్రస్థాయి కోచ్ ద్వారా సెహ్వాగ్‌తో పరిచయం ఏర్పడిందని వివరించాడు. అండర్-17 క్రికెట్‌లో తొలి డబుల్ సెంచరీ సాధించిన తర్వాత ఈ పరిచయం జరిగినట్లు గుర్తుచేసుకున్నాడు. అలాగే యువకుడిగా ఉన్నప్పుడు ఆశిష్ నెహ్రా తనకు ట్రోఫీ అందించిన ఫొటో గురించి కూడా ఆర్యవీర్ ప్రశ్నించాడు. ఈ సందర్భంగా కోహ్లీ తన క్రికెట్ ప్రయాణంలోని అనుభవాలను పంచుకున్నాడు. జీవితంలో పెద్ద కలలు కనాలని, తన సామర్థ్యంపై నమ్మకం ఉంచి ముందుకు సాగాలని చిన్నారి ఆర్యవీర్‌కు సూచించాడు.

గంభీర్ మహా గట్టోడు : మురళీ కార్తిక్ మద్దతు



టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గౌతమ్ గంభీర్ ఎన్నో విమర్శలను ఎదుర్కొంటున్నాడు. జట్టు ఎంపిక, ఆటగాళ్లకు ఇచ్చే అవకాశాలు, వ్యూహాలు, కోచింగ్ విధానంపై తరచూ చర్చ జరుగుతోంది. అయితే ఈ విషయంపై మాజీ క్రికెటర్ మురళీ కార్తిక్ స్పందించాడు. గంభీర్‌కు విమర్శలను తట్టుకునే సత్తా ఉందని, సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూల వ్యాఖ్యలను పక్కన పెట్టడం అతడికి తెలుసని అభిప్రాయపడ్డాడు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎవరైనా ఏదైనా మాట్లాడే పరిస్థితి ఏర్పడింది. గంభీర్‌పై ఎన్నో విమర్శలు వచ్చాయి. కానీ అతడు అవన్నీ పెద్దగా పట్టించుకోడు. విమర్శలకు ఎలా సమాధానం ఇవ్వాలో గంభీర్‌కు బాగా తెలుసు. తనపై వచ్చే విమర్శల నుంచి గంభీర్ దూరంగా ఉండాలి. తన ఉద్దేశాలు, చేస్తున్న పని సరైనదేనా అనే విషయాలపై దృష్టి పెట్టాలి. కోచ్‌గా మీ ఆలోచనలు, లక్ష్యాల విషయంలో నిజాయతీగా ఉండాలి. చివరికి అదే ముఖ్యం' అని గంభీర్‌కు మురళీ కార్తీక్ సూచించాడు.

భారత షూటింగ్‌లో మరో అద్భుతం

భారత షూటర్ నీరజ్‌కు కాంస్య పతకం



భారత షూటింగ్‌లో మరో అద్భుతం నమోదైంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు భారత షూటర్ నీరజ్ కుమార్ అర్హత సాధించాడు. బుధవారం జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ విభాగంలో కాంస్య పతకం సాధించి ఒలింపిక్స్ కోటాను ఖాయం చేసుకున్నాడు. ఫైనల్లో 346.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు లభించిన రెండో ఒలింపిక్ కోటా ఇదే కావడం విశేషం. అంతకుముందు పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జయపాల్ మాల్వియా రజతం సాధించి తొలి కోటాను అందించాడు. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్లో నీరజ్ అద్భుతంగా పోరాడాడు. ఒక దశలో రజత పతకం సాధించే అవకాశాలు కనిపించినప్పటికీ.. 34వ షాట్‌లో 9.4 స్కోరు చేయడంతో మూడో స్థానానికి పడిపోయాడు. స్లోవేకియాకు చెందిన పాట్రిక్ జానీ రజత పతకాన్ని దక్కించుకోగా.. ఇండివిడ్యువల్ న్యూట్రల్ అథ్లెట్ దిమిత్రి పిమెనోవ్ 362.8 పాయింట్లతో ప్రపంచ జూనియర్ రికార్డు నమోదు చేసి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. ఈ ముగ్గురూ లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు కోటా స్థానాలు సాధించారు. ఇదే ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరిన మరో భారత షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ 323.7 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచాడు.

టీమ్ ఈవెంట్‌లోనూ కాంస్యం!

వ్యక్తిగత విభాగంలోనే కాకుండా టీమ్ ఈవెంట్‌లోనూ భారత షూటర్లు సత్తా చాటారు. నీరజ్ కుమార్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, అఖిల్ షియోరాన్ కలిసి ఎలిమినేషన్ రౌండ్‌లో మొత్తం 1,751 పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని అందుకున్నారు. చెక్ రిపబ్లిక్ 1,754 పాయింట్లతో స్వర్ణం సాధించగా, నార్వే 1,752 పాయింట్లతో రజతం గెలుచుకుంది. కేవలం ఒక్క పాయింట్ తేడాతో భారత్ రజతాన్ని కోల్పోయింది.

సమ్రీన్ కౌర్‌తో అర్ష్‌దీప్ సింగ్..


ఖండాంతరాల్లో నిశ్చితార్థం..!

టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది. తన ప్రేయసి సమ్రీన్ కౌర్‌తో అతడు నిశ్చితార్థం చేసుకున్నాడు. ప్రస్తుతం భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనలో ఉండగా.. అక్కడే సమ్రీన్‌కు అర్ష్‌దీప్ ప్రపోజ్ చేశాడు. అనంతరం ఉంగరం తొడిగి తన ప్రేమను వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని సమ్రీన్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంది. దీంతో ఈ జంటకు క్రికెట్ అభిమానులు, నెటిజన్ల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అర్ష్‌దీప్‌తో నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలను సమ్రీన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. 'హాయ్ ఫియాన్సీ' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమ్రీన్ పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే లక్షకు పైగా లైక్స్ రావడం విశేషం. అర్ష్‌దీప్ సహచర ఆటగాళ్లు గుర్నూర్ బ్రార్, నమన్ ధీర్ కూడా ఈ జంటకు అభినందనలు తెలిపారు.



ఐపీఎల్ 2027 మినీ వేలానికి రంగం సిద్ధం

ఐపీఎల్ 2027 మినీ వేలానికి రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ మరోసారి ఐపీఎల్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. 2027 వేలంలో తన పేరును నమోదు చేసుకోనున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) వర్గాలు వెల్లడించాయి. పలు వివాదాల కారణంగా ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) అతడిని జట్టు నుంచి విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈసారి కొత్త ఫ్రాంచైజీతో ఒప్పందం కుదుర్చుకోవాలని ముస్తాఫిజుర్ భావిస్తున్నట్లు సమాచారం.ఐపీఎల్ వేలంలో పాల్గొనాలని ముస్తాఫిజుర్ ఆసక్తి వ్యక్తం చేయడంతో బీసీబీ అతడి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. అతడితో పాటు మరో ఆరుగురు బంగ్లాదేశ్ క్రికెటర్లు కూడా వేలంలో తమ పేర్లను నమోదు చేసుకోనున్నట్లు బోర్డు వెల్లడించింది. వారిలో నహిద్ రాణా, రిషాద్ హొస్సేన్, హసన్ మహ్మద్, తౌహిద్ హృదోయ్, తస్కిన్ అహ్మద్, షరీఫుల్ ఇస్లాం ఉన్నారు. ముస్తాఫిజుర్ రెహమాన్ ఐపీఎల్ 2026 వేలంలో రూ.9.20 కోట్ల భారీ ధరకు కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఎంపికయ్యాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన బంగ్లాదేశ్ ఆటగాడిగా నిలిచాడు. కాగా బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడుల నేపథ్యంలో భారత్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్‌లో ఆడించనుండటంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న బీసీసీఐ.. బంగ్లా పేసర్‌ను రీలీజ్ చేయాలని కేకేఆర్ ఫ్రాంచైజీని ఆదేశించింది. దీంతో కేకేఆర్ అతడిని జట్టు నుంచి విడుదల చేసింది. ఈ పరిణామం బీసీసీఐ, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మధ్య వివాదానికి దారితీసింది. చివరకు 2026 టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనే అంశంపైనా ప్రభావం చూపింది. బంగ్లా టోర్నీ నుంచి తప్పుకోవడంతో స్కాట్లాండ్‌కు అవకాశం దక్కిన సంగతి తెలిసిందే.



చైతన్య రథం
సినిమా
గురువారం 12 నవంబరు 2026 IX

‘భోగి’ విడుదల వాయిదా !

చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, సంపత్ నంది డైరెక్షన్‌లో తెరకెక్కిన హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా చిత్రం ‘భోగి’. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్ర విడుదలను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అనుకోని కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని వారు తెలిపారు. సినిమా విడుదలపై వచ్చే ఎలాంటి రూమర్లు లేదా ఊహాగానాలను నమ్మవద్దని మేకర్స్ ప్రేక్షకులను, అభిమానులను కోరారు. ప్రేక్షకుల అంచనాలకు తగినట్లుగా అదిరిపోయే అనుభూతిని అందించేందుకు కృషి చేస్తున్నామని, త్వరలోనే కొత్త విడుదల తేదీని వెల్లడిస్తామని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. ఇక భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. మరి ఈ చిత్ర కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడు ఉంటుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




‘బత్తా’.. రెండో వారంలో 2.3 మిలియన్ వ్యూస్!



విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటించిన ‘బత్తా’ చిత్రం థియేటర్ల తర్వాత ఓటీటీలోనూ మంచి ఆదరణ దక్కించుకుంటోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ తాజాగా విడుదల చేసిన గ్లోబల్ వీక్లీ చార్ట్‌లో ఈ సినిమా టాప్ స్థానాల్లో నిలిచింది. నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ టాప్ 10 (నాన్-ఇంగ్లీష్) విభాగంలో నవంబర్ 2 నుంచి 8 వరకు నమోదైన వ్యూయర్‌షిప్ ప్రకారం ‘బత్తా’ 5వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ వారం ప్రపంచవ్యాప్తంగా 2.3 మిలియన్ల వ్యూస్ నమోదు చేసింది. అంతకుముందు వారం 2.5 మిలియన్ వ్యూస్‌తో 4వ స్థానంలో నిలిచిన ఈ చిత్రం, రెండో వారం కూడా టాప్ 5లోనే కొనసాగుతోంది. ఇక దేశీయంగా నెట్‌ఫ్లిక్స్ ఇండియా చార్ట్‌లో ప్రస్తుతం నెం. 2 స్థానంలో ట్రెండ్ అవుతోంది.

బాలాజీ తరణీతరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దర్శకుడు అట్లీ, ప్రియా అట్లీ ఇతర భాగస్వాములతో కలిసి సంయుక్తంగా నిర్మించారు. మాస్టర్ సాయి పృథ్వీరాజ్, లిజోమోల్ జోస్, బేబీ సహస్ర శ్రీ, శాంతి బాలచంద్రన్, హరి కృష్ణన్, అర్జున్ చిదంబరం ఇతర కీలక పాత్రల్లో నటించారు. సాయి అభ్యంకర్ సంగీతం అందించారు. థియేటర్లలో మెప్పించిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా గ్లోబల్ ఆడియన్స్‌ను ఆకట్టుకుంటోంది.



విడుదలకు ముందే వారణాసి ఆల్‌టైమ్ రికార్డు

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ ‘వారణాసి’ ప్రీ-రిలీజ్ బిజినెస్‌లో ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఈ చిత్ర తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను ప్రముఖ పంపిణీ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్పీ ఏకంగా రూ. 300 కోట్ల భారీ ధరకు సొంతం చేసుకుంది. గతంలో రాజమౌళి ఆర్ఆర్ నెలకొల్పిన రికార్డులను బద్దలు కొట్టిన ఈ చిత్రం, ఏప్రిల్ 7, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. గ్లోబల్ సెన్సేషన్ తర్వాత దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ‘వారణాసి’. భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ చిత్రం, విడుదలకు ముందే బాక్సాఫీస్ ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా తెలుగు థియేట్రికల్ హక్కులు కనీవినీ ఎరుగని ధరకు అమ్ముడై సరికొత్త చరిత్రను లిఖించాయి. ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ ‘మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్పీ’ దాదాపు రూ. 300 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించి ‘వారణాసి’ తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను దక్కించుకుంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమ చరిత్రలోనే ఒక సినిమా తెలుగు హక్కులు ఈ స్థాయి రికార్డు ధర పలకడం ఇదే తొలిసారి. గతంలో రాజమౌళి తెరకెక్కించిన చిత్రం తెలుగు హక్కులు దాదాపు రూ. 225 కోట్లకు అమ్ముడుపోగా, ఇప్పుడు ‘వారణాసి’ ఆ రికార్డును ఏకంగా రూ. 75 కోట్ల భారీ మార్జిన్‌తో అధిగమించడం విశేషం. సురేష్ బాబు, ఏషియన్ సునీల్, దిల్ రాజు, నాగవంశీ వంటి ప్రముఖ నిర్మాతలు కూడా ఈ హక్కుల కోసం తీవ్రంగా పోటీపడినప్పటికీ, చివరకు మైత్రీ సంస్థ ఈ ఆల్‌టైమ్ రికార్డు డీల్‌ను ఖరారు చేసుకుంది. శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్, గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా జోనస్, సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు.

గాజు కన్ను పెట్టి లుక్ టెస్ట్ చేశారు..

తీరా చూస్తే పిలవలేదు: పారడైజ్ మేకర్స్ తీరుపై బాబు మోహన్ అసహనం!



సీనియర్ కమెడియన్ బాబు మోహన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నాని హీరోగా వచ్చిన ‘ది పారడైజ్’ చిత్ర బృందంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో ఈ సినిమాలో బాబు మోహన్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే స్క్రీన్‌పై మాత్రం ఆయన కనిపించలేదు. ఈ విషయంపై యాంకర్ అడిగిన ప్రశ్నకు బాబు మోహన్ స్పందిస్తూ అసలు ఏం జరిగిందో వివరిస్తూ అసంతృప్తి వెళ్లగక్కారు. “పారడైజ్ సినిమా కోసం నన్ను పిలిచి లుక్ టెస్ట్ చేశారు. నా కెరీర్‌లోనే మొదటిసారి మేకప్ టెస్ట్ జరిగింది. ఒక పెద్ద గాజు కన్ను పెట్టి, ఐదారు రకాల డ్రెస్సులు వేసి చూశారు. గెటప్ చాలా బాగుంది అని చెప్పారు. షూటింగ్ సమయానికి పిలుస్తాం అన్నారు. కట్ చేస్తే, సినిమా రిలీజ్ అయ్యేంత వరకు పిలుపు రాలేదు. టీవీలో ప్రమోషన్స్ చూసేవరకు నేను సినిమాలో లేననే విషయం నాకు పూర్తిగా అర్థం కాలేదు” అని ఆయన తెలిపారు.

నన్ను వద్దనుకుంటే కనీసం సమాచారం ఇవ్వాలనే కనీస సంస్కారం చిత్ర యూనిట్‌కు ఉండాలని బాబు మోహన్ పేర్కొన్నారు. “నేను పనికిరాను అనుకున్నారో లేక అంతకంటే గొప్ప నటులు దొరికారని భావించారో తెలియదు. కానీ ఏ కారణం చేతనైనా కుదరకపోతే కనీసం ఫోన్ చేసి చెప్పే మర్యాద పాటించాలి. అలాంటి సంస్కారం లేకపోవడం వల్లే, శని వెంటపడి ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయింది” అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన ‘చెవిలో పువ్వు’ సినిమాలో తాను లేకపోవడం వల్ల పోయిందని, ఆ తర్వాత ‘ప్రేమ ఖైదీ’లో తాను ఉండటం వల్లే సూపర్ హిట్ అయిందని బాబు మోహన్ ఈ సందర్భంగా ఉదాహరణగా ప్రస్తావించారు.